# పేదరికం ఓ బహువ్యాధి లక్షణం ..?

## (17 అక్టోబర్ "అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం" సందర్భంగా)

పేదరికం ఓ బహువ్యాధి లక్షణంగా ప్రపంచ మానవాళిని పట్టి పీడిస్తున్నది. పేదరికం ఒక ఆర్థిక సమస్య మాత్రమే కాదు, అది ఒక బహుముఖీన సమస్యలతో కూడిన విషవలయం. పేదరికంతో నిరక్షరాస్యత, మానవ హక్కుల ఉల్లంఘన, హింస, దోపిడీల, దొంగతనాలు, అసాంఘీక కార్యకలాపాలు, జీవన ప్రమాణాలు, అసురక్షిత గృహవసతులు, పోషకాహార లోపం, ఆరోగ్య అభద్రత, ఆకలిచావులు వంటివి ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటాయి.

అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం-2025:

1987లో జోసఫ్ వ్రెసిన్స్కి చొరవతో ఫ్రాన్స్, పారిస్ నగరంలో పేదరికం, ఆకలి చావులు, హింస, ప్రాణభయం బారినపడిన ప్రపంచ పౌరుల సమస్యలను చర్చించేందుకు లక్ష మందితో సమావేశం ఏర్పాటు చేయడం, 1992లో ఈ తీవ్ర సమస్యలకు స్పందించిన ఐక్యరాజ్యసమితి 17 అక్టోబర్ రోజున ప్రతి ఏటా "అంతర్జాతీయ పేదరిక నిర్మూలణ దినం" పాటించాలని నిర్ణయం తీసుకున్నారు. 2025 అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం ఇతివృత్తంగా "పేద కుటుంబాలకు గౌరవం, ఆత్మీయ చేయూత ఇవ్వడం ద్వారా సామాజిక, సంస్థాగత దుర్వినియోగాన్ని అంతం చేయడం" అనబడే అంశాన్ని తీసుకుని ప్రచారం చేయడం జరుగుతున్నది. పేదల దుస్థితిని సహానుభూతితో ఆకలింపు చేసుకొని, పేదరిక నిర్మూలనకు సదాలోచనలు, క్షేత్రస్థాయి ఆచరణలు చేయడానికి ఈ రోజును పాటించాలని సూచిస్తున్నారు. ఆర్థిక అసమానతలను తగ్గించడం, పేదల బడుగు బలహీన వర్గాల సుస్థిరాభివృద్ధికి కృషి చేయడం ప్రభుత్వాల కనీస భాద్యత అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా 1990 విశ్వ జనాభాలో 36 శాతం దారిద్ర్య రేఖ దిగువన ఉండగా, 2018 గణాంకాల ప్రకారం 8 శాతం మాత్రమే ఉన్నారని తేలింది. దక్షిణ ఆసియా, సబ్-సహారా ఆఫ్రికన్లు అధిక శాతం పేదరికంలో ఉన్నారని అంచనా. విశ్వవ్యాప్తంగా 55 శాతం జనాభాకు కనీసం ఒక్క సామాజిక రక్షణతో కూడిన ఆర్థిక చేయూతకు కూడా దూరంగా ఉన్నారని తేలింది.

ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యం?..:

2015లో ఐరాస రూపొందించిన 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030' ప్రకారం 2030 నాటికి పేదరికం, ఆకలి లేని ప్రపంచం అవతరించే దిశగా కార్యక్రమాలు రూపొందించాలని మార్గనిర్దేశనం చేస్తున్నారు. పేదల కష్టాలను అర్థం చేసుకోవడం, వారి గోడును సానుభూతితో ఆలకించడం, పేదరిక నిర్మూలనకు సరైన కార్యాచరణ చేపట్టడం ప్రస్తుత కర్తవ్యంగా ప్రపంచ దేశాలు భావించాలి. పేద పిల్లలకు (బాలురు, బాలికలు) విద్య అందించడంతో భవిష్యత్తులో వారికి ఆర్థికాదాయం పెరగడం, పేదరికం/నిరుద్యోగం తగ్గడం జరుగుతాయి. బాలలకు ఆర్థిక, పౌర, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక హక్కులను కల్పించడానికి కృషి చేయాలి. ఆహార పదార్థాల ప్రజాపంపిణి, వైద్య సదుపాయాల కల్పన, సురక్షిత నీరు, పరిసరాల పరిశుభ్రత, గర్భవతులకు పోషకాహారం అందించడం, ఉపాధి కల్పన లాంటి ప్రభుత్వ చర్యల ద్వారా పేదరికాన్ని తగ్గించవచ్చు.

భారతంలో పేదరికం?..:

అధిక జనాభాగల భారత్‌లో 6.5 శాతం (73 మిలియన్లు) ప్రజలు దారిద్ర్యరేఖ దిగువన ఉన్నారని, గత దశాబ్దకాలంలో 271 మిలియన్లను పేదరిక ఊబీలోంచి బయట పడ్డారని నివేదికలు తెలుపుతున్నాయి.

ఇండియాలోని ఒక శాతంగా ఉన్న ధనివంతులే 73 శాతం సంపదను అనుభవిస్తుండగా, 670 మిలియన్ల పేదల ఆదాయం ఒక శాతం మాత్రమే పెరిగిందని అంచనా వేశారు. మన దేశంలో అధిక జనాభా, వ్యవసాయ ఉత్పత్తుల తగ్గుదల, మౌళిక వసతుల లేమి, ఆర్థికవృద్ధి రేటు తగ్గడం, ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తక్కువగా ఉండడం, వైద్య ఆరోగ్య వసతుల కొరత, సామాజిక కారణాలు, శ్రమదోపిడి, వాతావరణ కారకాలు లాంటి సమస్యలతో పేదరికం ప్రబలటం జరుగుతున్నది.

భారత ప్రభుత్వం ఐఆర్‌డిపి, జవహర్ రోజ్‌గార్ యోజన, గ్రామీణ గృహవసతి, కరువు పనుల కల్పన, వృధాప్య పెన్షన్, అన్నపూర్ణ పథకం, గ్రామీణ ఉపాధి కల్పన, నేషనల్ అర్బన్ లైవ్‌లీహుడ్ మిషన్, ప్రధానమంత్రి కౌషల్ వికాస్ యోజన, ప్రధానమంత్రి జన్ ధన్ యోజన లాంటి పథకాలతో పేదరిక నిర్మూలన కార్యక్రమాలు అమలు చేస్తున్నది. రాష్ట్రప్రభుత్వాలు ప్రజాపంపిణి ద్వారా ఆహారధాన్యాలను అందిస్తూ, పలు పథకాలతో పేదలకు చేయూతను ఇస్తున్నారు. భారతదేశంలో పేదరికం ఫలితంగా శిశుమరణాలు(సాలీనా 1.4 మిలియన్లు), పోషకాహారలోపం (61 మిలియన్లు), బాలకార్మిక దురాచారం(12.5 మిలియన్లు), బాలల అవిద్య (25 శాతం), బాల్యవివాహాలు(44.5 శాతం), హెచ్‌ఐవి- ఏయిడ్స్ (2.7 మిలియన్లు) లాంటి దుష్పరిణామాలు కలుగుతున్నాయి. ప్రజలకు పని కల్పన, పోషకాహార భద్రత, అందరికీ ఉచిత విద్య అమలు ద్వారా మాత్రమే సమాజం ఆరోగ్యంగా, పేదరికానికి దూరంగా జీవించగలుగుతారు.

గత దశాబ్ద కాలంలో కరోనా కాటు వల్ల మాత్రమే ప్రపంచవ్యాప్తంగా పేదరికం గణనీయంగా పెరిగినట్లు గమనించటం జరిగింది.

విశ్వవ్యాప్తంగా కరోనా కారణంగా ప్రజల ఆదాయానికి కనీసం 20 శాతం కోత పడిందని, దీని వల్ల పేదలు అదనంగా 143-163 మిలియన్లు పెరిగే ప్రమాదంతో పాటుగా మిలియన్ల ప్రజలకు తీవ్ర ఆకలి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తెలుస్తున్నది. కరోనా విజృంభనతో ఆహారపదార్థాల సరఫరాలో ఆటంకం ఏర్పడటం, ఆహార కొరత ఎదురుకావడం, నిరుద్యోగం పెరగడం, కొనుగోలు సామర్థ్యం తగ్గడం విధిగా జరుగుతున్నది. వాతావరణ ప్రతికూల మార్పులు, విపత్తులు, కరువులు లాంటి ఏ ఉపద్రవం ఎగిసినా పేదలే ముందు ప్రభావితం అవడం సహజంగా జరుగుతున్నది. పేదరిక నిర్మూలనలో ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌరసమాజం తమ చేయూతను అందిస్తూ, మానవ హక్కులకు పట్టం కట్టి, ఆకలి చావులు లేని సంతోష తోరణాలు నిండిన భారతాన్ని నిర్మించుకుందాం.

-డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# క్రీడా రంగానికి కృషిపై ఉపరాష్ట్రపతి శ్రీ.సి.పి.రాధాకృష్ణన్ ప్రశంసలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:పార్లమెంటు భవనంలో ఇవాళ ఉప-రాష్ట్రపతి శ్రీ కె.పి.రాధాకృష్ణన్‌తో ఇద్దరు కేంద్ర మంత్రులతోపాటు ఇద్దరు సహాయ మంత్రులు సమావేశమయ్యారు. ఈ మేరకు కార్మిక-ఉపాధి, యువజన వ్యవహారాలు-క్రీడా శాఖల మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, ఈ రెండు శాఖల సహాయ మంత్రులు శ్రీమతి శోభా కరంద్లాజే, శ్రీమతి రక్షా నిఖిల్ ఖడ్సే సహా సీనియర్ అధికారులు కూడా వీరిలో ఉన్నారు. ఈ సందర్భంగా తమ శాఖల పరిధిలో చేపట్టిన కీలక కార్యక్రమాలు, విధాన సంస్కరణల గురించి వారు ఉప-రాష్ట్రపతికి వివరించారు.

కార్మికుల కోసం పని పరిస్థితులతో పాటు జీవన నాణ్యత మెరుగుదల, ఉపాధి పెంపు, సామాజిక- వృత్తిపరమైన భద్రత బలోపేతం, ఆరోగ్యానికి భరోసా, సామరస్యపూర్వక పారిశ్రామిక సంబంధాల పటిష్ఠీకరణ లక్ష్యంగా కార్మిక-ఉపాధి మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న సమగ్ర కార్యక్రమాలను ఉప-రాష్ట్రపతికి వివరించారు. వీటితోపాటు ఈ-శ్రమ్, శ్రమ్ సువిధ పోర్టళ్లు, ప్రధానమంత్రి వికసిత భారత్ రోజ్‌గార్ యోజన, నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్ తదితర ప్రధాన సంస్కరణలను ప్రముఖంగా ప్రస్తావించారు.

కార్మిక చట్టాల సరళీకరణకు మంత్రిత్వశాఖ చేస్తున్న కృషితో పాటు వివిధ రంగాల్లో సామాజిక భద్రత పెంపు సహా కొత్త ఉపాధి అవకాశాల సృష్టికి చేపట్టిన చర్యలపై ఉప-రాష్ట్రపతి హర్షం ప్రకటించారు. కార్మిక సంక్షేమం మెరుగుదల, సమ్మిళిత ఆర్థిక వృద్ధి దిశగా భారత్ పయనం కొనసాగింపు తదితరాలపై కార్మిక-ఉపాధి మంత్రిత్వశాఖ నిబద్ధతను ఆయన ప్రశంసించారు.

అనంతరం యువజన వ్యవహారాలు-క్రీడా మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యక్రమాల గురించి కూడా ఉప-రాష్ట్రపతికి మంత్రులతోపాటు అధికారులు వివరించారు. యువతరంలో సామర్థ్యం, నాయకత్వ లక్షణాల వికాసం, దేశ ప్రగతిలో పాత్ర దిశగా "జన భాగస్వామ్య నుంచి ప్రజా ఉద్యమం వైపు" అనే దృక్పథంతో భాగస్వామ్య కార్యక్రమాల ద్వారా సమాజ సేవా స్ఫూర్తిని ప్రోత్సహించడంపై మంత్రిత్వశాఖ కృషిని వారు సమగ్రంగా తెలిపారు.

ఈ మేరకు జాతీయ యువజన విధానం, మేరా యువ భారత్ (మై భారత్), జాతీయ సేవా పథకం, యూత్ హాస్టళ్లు, జాతీయ యువజన అవార్డులు వంటి కీలక యువతరం ఆధారిత కార్యక్రమాల గురించి ఉప-రాష్ట్రపతికి సమాచారం ఇచ్చారు. డిజిటల్, క్షేత్ర స్థాయి చర్చా కార్యకలాపాల ద్వారా దేశవ్యాప్త యువత అనుసంధానంలో 'మై భారత్ పోర్టల్' కీలక ముందడుగని వారు వివరించారు. దేశ పురోగమనంలో యువతను భాగస్వాములను చేయడానికి చేపట్టిన 'మేరా యువ భారత్' కార్యక్రమాన్ని శ్రీ సి.పి.రాధాకృష్ణన్ ప్రశంసించారు. అలాగే సాంస్కృతిక అవగాహనకు ప్రోత్సాహం, 'ఒకే భారత్-శ్రేష్ఠ భారత్' స్ఫూర్తి బలోపేతంలో యువత ఆదానప్రదాన కార్యక్రమాల ప్రాధాన్యా న్ని ఆయన స్పష్టీకరించారు.

అదేవిధంగా "యూత్ 20 (వై20) సమ్మిట్, మేరీ మాటీ-మేరా దేశ్, వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్-2025 (వీబీవైఎల్‌డీ-2025), దీపావళి విత్ మై భారత్, వికసిత భారత్ దిశగా మాదకద్రవ్య విముక్త యువతరం" వంటి అనేక వినూత్న యువతరం లక్షిత కార్యక్రమాల గురించి కూడా ఉప-రాష్ట్రపతికి మంత్రులు, అధికారులు వివరించారు.

క్రీడారంగం ప్రగతి, క్రీడాకారులకు ప్రోత్సాహం కోసం చేపట్టిన కార్యక్రమాలను కూడా అధికారులు ఆయనకు తెలిపారు. ఈ మేరకు "ఖేలో ఇండియా, టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం, జాతీయ క్రీడా సమాఖ్యలకు సహాయం, ఖేలో భారత్ నీతి, ఒన్ కార్పొరేట్ ఒన్ స్పోర్ట్ సీఎస్ఆర్ మోడల్" వంటి క్రీడాభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఒలింపిక్స్, పారాలింపిక్స్ సహా అంతర్జాతీయ వేదికలపై భారత క్రీడాకారులు... ముఖ్యంగా మహిళలు ప్రదర్శించిన అద్భుత ప్రతిభాపాటవాలను ఉప-రాష్ట్రపతి ప్రశంసించారు. దేశవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించడంలో కార్పొరేట్ రంగం పాత్ర పెరుగుతుండటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

భారత్‌లో ఒలింపిక్స్ సహా కీలక అంతర్జాతీయ క్రీడోత్సవాల నిర్వహణకు మంత్రిత్వశాఖ చేస్తున్న కృషిని ఉప-రాష్ట్రపతి ఈ సందర్భంగా ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలు క్రీడాభివృద్ధికి గణనీయంగా తోడ్పడతాయన్నారు. ప్రపంచ వర్ధమాన క్రీడా దేశంగా భారత్ స్థానాన్ని ఇవన్నీ బలోపేతం చేస్తాయని ఆయన అన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌కు రూ. 10,000 కోట్ల ఆదాయం: కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న ఒక గిగావాట్ హైపర్‌స్కేల్ గూగుల్ డేటా సెంటర్ ఆంధ్రప్రదేశ్‌కు దాదాపు రూ. 10,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తుందని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈ రోజు పేర్కొన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ అభివృద్ధి, స్వావలంబన ప్రస్థానంలో కీలక మైలురాయిగా కేంద్ర మంత్రి ఈ ప్రాజెక్టును అభివర్ణించారు. అయిదేళ్ల కాలంలో (2026-2030) దాదాపు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి ద్వారా రాష్ట్రంలో 5,000 ? 6,000 ప్రత్యక్ష ఉద్యోగాలు, మొత్తంగా 20,000 ? 30,000 ఉద్యోగావకాశాలు లభిస్తా యని వివరించారు. అదే సమయంలో విశాఖపట్నం నగరానికి అవసరమైన మానవ వనరులు, మౌలిక సదుపా యాలు, విద్యుత్తు, శీతలీకరణ సదుపాయాలను అందిస్తుందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గణనీయంగా ఎన్నో రెట్లు మెరుగుపరుస్తుందని వివరించారు.

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు.. న్యూఢిల్లీలో నిర్వహించిన భారత్ ఏఐ శక్తి కార్యక్రమం సందర్భంగా గూగుల్ ప్రకటించిన అనంతరం కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు.

దేశంలో మొదటి గిగా వాట్ పరిమాణం గల డేటా సెంటర్, గూగుల్‌కు చెందిన తొలి ఏఐ హబ్ ఈ ప్రాజెక్టులో ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సహకా రాన్ని డాక్టర్ చంద్రశేఖర్ ప్రశంసిం చారు. ఆంధ్రప్రదేశ్‌కు గూగుల్‌ను తీసుకురావడంలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, శ్రీ నారా లోకేశ్ నిరంతర కృషిని అభినందించారు.

రాష్ట్రాన్ని డిజిటల్ హబ్‌గా నిలపడంలో, దేశవ్యాప్తంగా ఏఐ ఆధారిత పరివర్తనను వేగవంతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక ముం దడుగు అని ఆయన వ్యాఖ్యానించారు.

కేంద్ర రైల్వే, సమాచార -ప్రసార, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్, ఆర్థిక-కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖా మంత్రి శ్రీ నారా లోకేశ్, గూగుల్ క్లౌడ్ సీఈవో శ్రీ థామస్ కురియన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బీఎల్ఓలకు ప్రత్యేక ఉప కలెక్టర్ సూచన



అమరావతి, అక్టోబర్ 16: ఓటరు జాబితా తయారీ లో బూత్ స్థాయి అధికారులు లు ప్రలోభాలకు లొంగొద్దని ప్రత్యేక ఉప కలెక్టర్ బి పద్మావతి సూచించారు. నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి హోదాలో ఆమె బీఎల్వోలతో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి బీఎల్ ఓ తన యాప్ లో ఫారం 6 ఓటరు చేర్పులు, ఫారం 7 తొలగింపులు, ఫారం 8 మార్పులు గురించి క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎవరి ప్రలోభాలకు లొంగకుండా తొలగింపులు, నివాసం మార్పులు చేయరాదన్నారు. 2002 నాటి ఓటర్ల జాబితా డేటా ప్రతి బీఎల్ ఓ వద్ద అందుబాటులో ఉందన్నారు. నామకరణం లేదా పార్ట్ నంబర్‌లో మార్పు ఉన్నప్పటికీ, 2002 నాటి అదే ప్రాంతం లేదా వీధిని 2025 నాటి దానితో మ్యాప్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్‌లు ఎన్.వెంకటరావు, బి మురళి మోహనరావు, ఎన్ ,రమేష్ , బి .అప్పల స్వామి లతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు.

# 290 కేజీలు గంజాయి స్వాధీనం..

## -కారులో తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు



శ్రీకాకుళం, అక్టోబర్ 16 : జిల్లాలోని ఎచ్చెర్ల మండలం చిలకపాలెం వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బంది బుధవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కారులో తరలిస్తున్నదాదాపు 290 కేజీల గంజాయిని రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 40 పాకెట్లలో ఈ గంజాయిని తరలిస్తున్నారు.

కారు డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ కె వి మహేశ్వరరెడ్డి గురువారం నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో తెలిపారు. ఒడిశాకు చెందిన కోరపుట్ జిల్లా లంపటాపట్ గ్రామానికి చెందిన సమర మటం అలియాస్ డుంబురు అలియాస్ గోపాల్ అనే వ్యక్తి ఈ గంజాయిని ఉత్తరప్రదేశ్ లోని భాగ్ పట్ జిల్లాలో ఉంటున్న అతని యజమాని గౌరవ్ చెప్పినట్లుగా మీరట్‌కు తరలిస్తున్నాడని తెలిపారు. ఒడిశా నుంచి సుంకిలి, పొత్తంగి మీదుగా సాలూరు, రామభద్రపురం, రాజాం మీదుగా జాతీయ రహదారికి వస్తుండగా కారును పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు.. ఇంత పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకున్న ఎచ్చెర్ల పోలీసులని ఎస్పీ ప్రశంసించారు.

# వినతిపత్రం అందజేస్తున్న టీజేఎస్ నాయకులు



అమరావతి, అక్టోబర్ 16: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పై రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయాలనే టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నర్సంపేట ఆర్డిఓ కార్యాలయం అధికారికి టీజేఎస్ నాయకులు ఈ రోజు వినతి పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలలో, విద్యా, ఉద్యోగ రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్లపై అనేక సంవత్సరాలు జరిగిన ఉద్యమాలను గుర్తించి సమగ్ర కులగణన చేసిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ ప్రకటించిందని, రాజకీయ పక్షాలు ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి బిల్లు పంపినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి పంపిన బిల్లును ఆమోదించకుండా అనేక రోజుల నుండి పెండింగ్లో పెట్టిందని ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్లురాజ్యాంగంలోని షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చకుండా, పార్లమెంటులో ఆమోదించ కుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని శ్రీనివాస్ ఆరోపించారు. దీంతో బీసీలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు లేక తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్లోని 9 లో రిజర్వేషన్లను చేర్చి బీసీలకు న్యాయం చేయాలి ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్, గుంటి రామచందర్, సోల్తి సాయికుమార్, ఎండి మహబూబ్‌అలీ, సందాని గుంటి సంజీవలు పాల్గొన్నారు.

# భారత్ నుంచి అమెరికాకు అంతర్జాతీయ పోస్టల్ సేవల పునరుద్ధరణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:అమెరికాకు అన్ని రకాల అంతర్జాతీయ పోస్టల్ సేవలను 15 అక్టోబర్ 2025 నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు భారత ప్రభుత్వ కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పోస్టల్ విభాగం ప్రకటించింది.

అన్ని రకాల పోస్టల్ సర్వీసులను నిలిపివేస్తూ అమెరికా ప్రభుత్వం జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 14324 కు అనుగుణంగా భారత్ 22 ఆగస్టు 2025 న ఆఫీస్ మెమోరాండం ద్వారా అమెరికాకు తపాలా సేవలను నిలిపివేసింది. దిగుమతి సుంకాల వసూలు, చెల్లింపు కోసం అమెరికా కస్టమ్స్, బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) ప్రవేశపెట్టిన కొత్త నియంత్రణ నిబంధనల కారణంగా ఈ నిలిపివేత అవసరమైంది. విస్తృతమైన వ్యవస్థ అభివృద్ధి, సీబీపీ ఆమోదం ఉన్న అర్హత కలిగిన సంస్థలతో సమన్వయం, ఢిల్లీ, మహారాష్ట్ర సర్కిళ్ళలో విజయవంతమైన ప్రయోగాత్మక పరీక్షల తరువాత ఇండియా పోస్ట్ ఇప్పుడు డెలివరీ డ్యూటీ పెయిడ్ (డీడీపీ) ప్రాసెసింగ్ కోసం నియమాలకు అనుగుణమైన వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఈ కొత్త ఏర్పాటు ప్రకారం, అమెరికాకు పంపే వాటికి వర్తించే అన్ని కస్టమ్స్ సుంకాలను బుకింగ్ సమయంలో భారతదేశంలో ముందస్తుగా వసూలు చేస్తారు. ఆమోదం ఉన్న అర్హత కలిగిన సంస్థల ద్వారా నేరుగా సీబీపీకి పంపుతారు. దీనివల్ల అన్ని నియంత్రణ నిబంధనలకు పూర్తి కట్టుబాటుతో పాటు వేగంగా కస్టమ్స్ అనుమతి, అమెరికాలోని చిరునామాదారులకు ఎటువంటి అదనపు సుంకం లేదా ఆలస్యం లేకుండా నిరంతర సరఫరా సాధ్యమవుతుంది.

సీబీపీ మార్గదర్శకాల ప్రకారం, అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్స్ యాక్ట్ - ఐఈఈపీఏ) పరిధిలో భారత్ నుంచి అమెరికాకు పంపే తపాలా వస్తువులపై ప్రకటించిన ఎఫ్ఓబీ విలువలో 50% ఫ్లాట్ రేటుతో కస్టమ్స్ డ్యూటీ వర్తిస్తుంది. కొరియర్ లేదా వాణిజ్యపరమైన సరుకుల మాదిరిగా పోస్టల్ వస్తువులపై ఎటువంటి అదనపు ప్రాథమిక సుంకాలు లేదా ఉత్పత్తి సంబంధ సుంకాలు ఉండవు. అనుకూలమైన ఈ సుంకం విధానం ఎగుమతిదారులకు అయ్యే మొత్తం ఖర్చును గణనీయంగా తగ్గిస్తుంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు (ఎంఎస్ఎంఈలు), హస్త కళాకారులు, చిన్న వ్యాపారులు, ఇ-కామర్స్ ఎగుమతిదారులకు పోస్టల్ రవాణా విధానం మరింత తక్కువ ఖర్చుతో కూడిన, పోటీదాయకమైన సరకు రవాణా మార్గంగా మారుతుంది.

ముఖ్యంగా, డెలివరీ డ్యూటీ పెయిడ్ (డీడీపీ), అర్హత కలిగిన సంస్థల సేవల కోసం తపాలా శాఖ వినియోగదారులపై ఎలాంటి అదనపు రుసుములను విధించదు. పోస్టల్ టారిఫ్‌లు యథాతథంగా కొనసాగుతాయి. దీనివల్ల ఎగుమతిదారులు సవరించిన యూఎస్ దిగుమతి నిబంధనలను అనుసరిస్తూనే తక్కువ ఖర్చుతో అంతర్జాతీయ డెలివరీ రేట్ల ప్రయోజనాన్ని కొనసాగించగలరు. ధరను అందుబాటులో ఉంచడానికి, ఎంఎస్ఎంఈలకు మద్దతు ఇవ్వడానికి, పోస్టల్ ద్వారా భారత ఎగుమతులను పెంచడానికి ఈ చర్య తీసుకున్నారు.

ఇప్పుడు వినియోగదారులు అమెరికాకు పంపడానికి అన్ని రకాల అంతర్జాతీయ తపాలా మెయిల్స్ - ఈఎంఎస్, ఎయిర్ పార్సెల్, రిజిస్టర్డ్ లెటర్స్/ప్యాకెట్లు, ట్రాక్డ్ ప్యాకెట్లను - ఏదైనా పోస్టాఫీస్, ఇంటర్నేషనల్ బిజినెస్ సెంటర్ (ఐబీసీ), డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రం (డీఎన్కే) లోని సెల్ఫ్ సర్వీస్ పోర్టల్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. డెలివరీ డ్యూటీ పెయిడ్ విధానం వ్యాపారాన్ని మరింత సులభతరం చేస్తుంది. పన్ను వసూలులో పూర్తి పారదర్శకతను తీసుకొస్తుంది. ఇప్పుడు అమెరికాకు పోస్టు పంపేవారు వర్తించే అన్ని సుంకాలను భారత్ లో ముందస్తుగా చెల్లించవచ్చు.

# ఢిల్లీలో మంగోలియా అధ్యక్షుడిని కలిసిన రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:2025 అక్టోబర్ 14న ఢిల్లీలో మంగోలియా అధ్యక్షుడు శ్రీ ఉఖ్నాగిన్ ఖురేల్సుఖ్ తో రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ సమావేశమయ్యారు. శాంతి, సంక్షేమం విషయంలో ఇరు దేశాలు ఉమ్మడి ప్రయోజనాలను కలిగి ఉన్నాయని ఇరువురు నాయకులూ అంగీకరించారు. ఈ సమావేశం ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరిన్ని కొత్త రంగాలకు విస్తరిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

రెండు దేశాలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయని.. ఈ సహకారానికి రక్షణ రంగం చాలా ముఖ్యమైన అంశమని రక్షణ మంత్రి, మంగోలియా అధ్యక్షులు అభిప్రాయపడ్డారు. రెండు దేశాల మధ్య విస్తృత సంబంధాలను నెలకొల్పేందుకు కొంతకాలంగా జాయింట్ వర్కింగ్ గ్రూప్ సమావేశం, సాయుధ బలగాల మధ్య సంబంధాలు, ఉన్నత స్థాయి పర్యటనలు, సామర్థ్య నిర్మాణం, శిక్షణ కార్యక్రమాలు, ద్వైపాక్షిక విన్యాసాలతో సహా ద్వైపాక్షిక రక్షణ ఒప్పందాలు విస్తరించాయి.

మంగోలియన్ సాయుధ దళాలకు సంబంధించి సైబర్ భద్రత, సామర్థ్యాల పెంపులో సహకారానికి గానూ భారతదేశానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. శ్రీ రాజ్‌నాథ్ సింగ్ హోం మంత్రిగా ఉన్నప్పుడు చమురు శుద్ధి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. దీని ప్రారంభోత్సవం కోసం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీతో పాటు మంగోలియాలో పర్యటించాలని ఆయనను ఆహ్వానించారు.

2018, 2022లో ఆ దేశ పర్యటన సందర్భంగా అధ్యక్షులు చూపించిన అప్యాయతను రక్షణ మంత్రి గుర్తు చేసుకున్నారు.

భారత్, మంగోలియా మధ్య దౌత్య సంబంధాలు ప్రారంభమై 70 సంవత్సరాలయిన సందర్భంగా 2025 అక్టోబర్ 13 నుంచి 16 వరకు మంగోలియా అధ్యక్షులు శ్రీ ఉఖ్నాగిన్ ఖురేల్సుఖ్ భారతదేశంలో అధికారికంగా పర్యటిస్తున్నారు.

# 'ఫార్చ్యూన్ లీడర్‌షిప్ అవార్డులు-2025'లో హెచ్ఆర్ ఎక్స్‌లెన్స్ అవార్డు టెలికమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ ఇండియా సంస్థకు ప్రదానం




న్యూఢిల్లీ, అక్టోబర్ 16:'ఫార్చ్యూన్ లీడర్‌షిప్ అవార్డులు–2025'లో హెచ్‌ఆర్ ఎక్స్‌లెన్స్ అవార్డును టెలికమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ ఇండియా సంస్థ (టీసీఐఎల్) కు ఇచ్చారు. అవార్డుల ప్రదానం కార్యక్రమాన్ని ఈ నెల 11న ఢిల్లీలోని రాడిసన్ బ్లూ ప్లాజాలో నిర్వహించారు. టీసీఐఎల్ మినీరత్న షెడ్యూలు 'ఎ'లో స్థానమున్న ఒక ప్రభుత్వ రంగ సంస్థ. మార్గదర్శకంగా నిలుస్తున్న మానవ వనరుల విధానాలను అమలు చేస్తున్నందుకూ, ఉద్యోగుల ప్రతిభకు మెరుగులు దిద్దుతున్నందుకూ, నవకల్పననూ, సమ్మిళితత్వాన్నీ ప్రోత్సహిస్తున్నందుకూ ఈ అవార్డును ఇచ్చి, టీసీఐఎల్‌ను సత్కరించారు. ఆయుష్ మంత్రిత్వ శాఖలో ఇదివరకు సభ్యునిగా పనిచేసిన డాక్టర్ దినేశ్ ఉపాధ్యాయ్, శ్రీ ఎం.ఎస్. నేత్రపాల్, ఐఆర్ఎన్‌ల చేతుల మీదుగా టీసీఐఎల్ సీజీఎమ్ (హెచ్‌ఆర్) శ్రీ వి. సురేశ్ బాబు అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

టీసీఐఎల్ 2021 నుంచి మానవ వనరుల విభాగానికి సంబంధించి రాబోయే కాలంలో చోటు చేసుకోగల మార్పులను ముందస్తుగా అంచనా వేసి తగిన సంస్కరణలను విస్తృతంగా అమలు చేసింది. 'మిషన్ కర్మయోగి'లో నిర్దేశించిన ప్రమాణాలకు తులతూగేలా సిబ్బందికి సముచిత శిక్షణను అందించింది. సంస్థ చేపట్టిన ముఖ్య కార్యక్రమాల్లో.. సమగ్ర హెచ్‌ఆర్ విధానం, జవాబుదారుతనాన్ని ప్రవేశపెడుతూ విభాగాల వారీ పునర్‌వ్యవస్థీకరణ, ప్రతిభే గీటురాయిగా పదోన్నతులు, డీపీసీల ప్రక్రియను నిర్దిష్ట కాలానికల్లా ముగించడం, పనితీరుతో ముడిపెట్టిన నిరవ్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయడం, బహుమతుల పద్ధతిని ప్రవేశపెట్టడం, 'ఈ–ఆఫీస్'తోనూ, ఈఆర్‌పీ ద్వారానూ డిజిటలీకరణకు బాట వేయడం.. ఇవి కొన్ని.

నైపుణ్యాలకు పదును పెట్టడంపై టీసీఐఎల్ ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొంటోంది. సంస్థ కార్యనిర్వాహకులు సైబర్ భద్రత, నెట్‌వర్కింగ్, ఆడిటింగ్, అధిక విలువ కలిగిన ప్రాజెక్టులను అనుకున్న కాలానికే పూర్తి చేయడం.. ఈ పనుల్లో ప్రపంచ శ్రేణి ధ్రువపత్రాలను అందుకున్నారు.

సమ్మిళితత్వాన్నీ, పారదర్శకత్వాన్నీ, నవకల్పననూ పెంచుతూ, ప్రజల ప్రయోజనాలకే టీసీఐఎల్ పెద్దపీట వేస్తోంది. ఈ విధానం డిజిటల్ ఇండియా, స్మార్ట్ నగరాలు, భారత్‌నెట్ (ఃప్ట్రజీతీజీబిజేవబి) వంటి జాతీయ ప్రాధాన్యం కలిగిన కార్యక్రమాలకు అండదండలను అందిస్తోంది. విధానాలనూ, సాంకేతికతనూ, ప్రతిభనూ ఒకదానితో మరొకటి పెనవేయాలనేదే మానవ వనరుల పరంగా ఈ సంస్థ అనుసరిస్తున్న వ్యూహం. ఈ వ్యూహం మన దేశంలో డిజిటల్ సేవల అందజేతను ఇంతింతగా విస్తరించడంలో టీసీఐఎల్‌ను ఓ ఆదర్శప్రాయ పీఎస్‌యూగా నిలబెడుతోంది.

టీసీఐఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సంజీవ్ కుమార్ "ఈ హెచ్‌ఆర్ ఎక్స్‌లెన్స్ అవార్డు ఒక మహత్తర ఘట్టం. ఈ పురస్కారం మా బృందం అంకితభావాన్ని ప్రతిబింబిస్తోంది. టీసీఐఎల్‌లోని మా బృంద సభ్యులంతా కలిసి 'డిజిటల్ ఇండియా' ఆశయం సాధనకు అనుగుణంగా కొత్త కొత్త ఆలోచనలను చేస్తూ, సిబ్బందినంతా ఏకతాటి మీద నడిపిస్తూ ముందుకు సాగుతోంది. ఈ పురస్కారం దీర్ఘకాల ప్రాతిపదికన వృద్ధిని సాధిస్తూ, దేశ ప్రజలను పరస్పరం అనుసంధానించాలన్న మా ఆకాంక్షను బలపరుస్తుంద''ని పేర్కొన్నారు.

టీసీఐఎల్ గురించి : టెలికమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ ఇండియా సంస్థ (టీసీఐఎల్)ను 1978లో ఏర్పాటు చేశారు. ఇది భారత ప్రభుత్వ సంస్థ. ఈ సంస్థ ప్రపంచ శ్రేణి టెలికమ్ కన్సల్టెన్సీ, ఇంజినీరింగ్ సంస్థల్లో ఒకటిగా పేరు తెచ్చుకుంది. టెలికమ్యూనికేషన్స్ రంగంతో పాటు ఐటీ, మౌలిక సదుపాయాల కల్పన రంగాల్లో అన్ని రకాల సేవలనూ టీసీఐఎల్ అందిస్తోంది. ఇంతవరకు 100 కన్నా ఎక్కువ దేశాల్లో 500కు పైగా ప్రాజెక్టులను పూర్తి చేసింది. భారత్ డిజిటల్ రంగ అభివృద్ధిలోనూ, అంతర్జాతీయంగా టెలికం రంగ సహకారంలోనూ ఈ సంస్థ కీలక పాత్రను పోషిస్తోంది.

# సీడీఎస్ రచించిన 'రెడీ, రిలెవెంట్ అండ్ రిసర్జెంట్ II: షేపింగ్ ఎ ఫ్యూచర్ రెడీ ఫోర్స్' పుస్తకాన్ని విడుదల చేసిన రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ రచించిన 'రెడీ, రిలెవెంట్ అండ్ రిసర్జెంట్ ఎఎ: షేపింగ్ ఎ ఫ్యూచర్ రెడీ ఫోర్స్' అనే పుస్తకాన్ని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఈ రోజు విడుదల చేశారు. భారత సాయుధ దళాలను భవిష్యత్తుకు అనుగుణంగా సిద్ధం చేయడానికి సమగ్రమైన, భవిష్యత్తు–ఆధారితమైన ప్రణాళికను ఈ పుస్తకం అందిస్తుంది. ఇది మారుతున్న యుద్ధ స్వభావాన్ని లోతుగా విశ్లేషిస్తుంది.. యుద్ధాల గురించి పరిణామాత్మక అవలోకనాన్ని అందిస్తుంది.. సైబర్‌స్పేస్, అంతరిక్ష–ఆధారిత ఆపరేషన్స్, కాగ్నిటివ్ వార్‌ఫేర్, భారత సాయుధ దళాల కోసం పెరుగుతున్న వాటి ఔచిత్యంపై ప్రధానంగా దృష్టి సారించింది.

బలమైన సైనిక నాయకత్వం, సంస్థాగత బలం ఆవశ్యకతను ప్రధానంగా ప్రస్తావిస్తూ.. ఈ పుస్తకం భారత సైనిక భవిష్యత్తు గురించిన దృక్పథాన్ని ధైర్యంగా తెలియజేస్తుంది.. ఇది చారిత్రక జ్ఞానంతో ముడిపడి.. సాంకేతిక పురోగతితో నడుస్తూ, సంసిద్ధతను, విశ్వసనీయతను, ప్రఖ్యాతిని పొందాలనే భారత దార్శనికతపై ప్రధానంగా దృష్టి సారించింది. ఈ పుస్తక విడుదల కార్యక్రమంలో సెంటర్ ఫర్ జాయింట్ వార్‌ఫేర్ స్టడీస్ డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ (డాక్టర్) అశోక్ కుమార్, పెంటగాన్ ప్రెస్ నుంచి ప్రచురణకర్త శ్రీ రాజన్ ఆర్య పాల్గొన్నారు.

# కర్నూలులో దాదాపు రూ. 13,430 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 16: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అక్టోబరు 16న ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తారు. ఉదయం 11:15 గంటల సమయంలో నంద్యాల జిల్లా శ్రీశైలం శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానంలో ప్రత్యేక పూజలతో పాటు దర్శనం చేసుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 12:15 గంటలకు శ్రీశైలంలోని శ్రీ శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శిస్తారు.

అనంతరం ప్రధానమంత్రి కర్నూలుకు బయలుదేరి మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో దాదాపు రూ. 13,430 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేసి, జాతికి అంకితం చేస్తారు. ఈ సందర్భంగా బహిరంగ సభనుద్దేశించి ప్రసంగిస్తారు.

శ్రీశైలంలో ప్రధానమంత్రి

12 జ్యోతిర్లింగాలు, 52 శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానంలో ప్రధానమంత్రి దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జ్యోతిర్లింగం, శక్తి పీఠం ఒకే ప్రాంగణంలో కలిసి ఉండడం ఈ ఆలయ ప్రత్యేకత. దేశం మొత్తం మీద ఈ తరహా దేవాలయం ఇదొక్కటే.

ధ్యాన మందిరంతో కూడిన శ్రీ శివాజీ స్ఫూర్తి కేంద్ర స్మారక సముదాయాన్ని కూడా ప్రధానమంత్రి సందర్శిస్తారు. నాలుగు మూలల్లో నాలుగు ప్రతిష్ఠాత్మక కోటలు – ప్రతాప్‌గఢ్, రాజ్‌గఢ్, రాయ్‌గఢ్, శివనేరి నమూనాలున్నాయి. మధ్యలో ఛత్రపతి శివాజీ మహారాజ్ తీక్షణమైన ధ్యానంలో ఉన్న విగ్రహం ఉంది. శ్రీ శివాజీ స్మారక కమిటీ ఈ కేంద్రాన్ని నిర్వహిస్తుంది. 1677లో ఛత్రపతి శివాజీ మహారాజ్ ఈ పవిత్ర మందిరాన్ని సందర్శించిన చరిత్రాత్మక ఘట్టం స్మారకార్థం శ్రీశైలంలో దీనిని నెలకొల్పారు.

కర్నూలులో ప్రధానమంత్రి

దాదాపు రూ. 13,430 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసి, ప్రారంభించి, జాతికి అంకితం చేస్తారు. పరిశ్రమ, విద్యుత్ సరఫరా, రోడ్లు, రైల్వేలు, రక్షణ తయారీ, పెట్రోలియం – సహజ వాయువు వంటి కీలక రంగాలకు చెందిన ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి. రాష్ట్రంలో ప్రాంతీయ మౌలిక సదుపాయాలను పెంపొందించడం, పారిశ్రామికీకరణను వేగవంతం చేయడం, సమ్మిళిత సామాజిక–ఆర్థిక వృద్ధిని సాధించడంలో ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనం.

కర్నూలు– పూలింగ్ స్టేషనులో రూ. 2,880 కోట్ల పెట్టుబడితో సరఫరా వ్యవస్థ బలోపేతం కోసం ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. 765 కిలోవాట్ల డబుల్ సర్క్యూట్ కర్నూలు–ఎఎఎ పూలింగ్ స్టేషన్ – చిలకలూరిపేట సరఫరా మార్గం నిర్మాణం కూడా ఈ ప్రాజెక్టులో ఉంది. ఇది సరఫరా సామర్థ్యాన్ని 6,000 ఎంవీఏకు పెంచడంతోపాటు భారీగా పునరుత్పాదక ఇంధన సరఫరాకు వీలు కల్పించి దేశాభివృద్ధికి తోడ్పడుతుంది.

కర్నూలులోని ఓర్వకల్, కడపలోని కొప్పర్తి పారిశ్రామిక ప్రాంతాలకు కూడా ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. మొత్తం రూ. 4,920 కోట్లకు పైగా పెట్టుబడితో వీటిని చేపడుతున్నారు. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి ? అమలు ట్రస్టు, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఐఐసీ) సంయుక్తంగా ఈ ఆధునిక, బహుళ రంగాల పారిశ్రామిక కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నాయి. కార్యకలాపాలు మొదలుపెట్టేందుకు సిద్ధంగా, అన్ని సౌకర్యాలూ సమీపంలోనే ఉండేలా వీటిని రూపొందించారు. ఇవి రూ. 21,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తాయని, దాదాపు లక్ష ఉద్యోగాలను సృష్టిస్తాయని అంచనా. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధితోపాటు అంతర్జాతీయ పోటీతత్వాన్ని పెంపొందిస్తాయి.

రోడ్డు మౌలిక సదుపాయాలను పెంపొందించడం కోసం.. సబ్బవరం నుంచి షీలానగర్ వరకు రూ. 960 కోట్లతో ఆరు వరుసల కొత్త హైవే నిర్మాణానికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. విశాఖపట్నంలో రద్దీని తగ్గించడంతోపాటు వాణిజ్యం, ఉపాధి పరంగా సౌలభ్యం కల్పించడం దీని లక్ష్యం. అంతేకాకుండా దాదాపు రూ. 1,140 కోట్ల విలువైన ఆరు రోడ్డు ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. పీలేరు– కాలూరు సెక్షన్ నాలుగు వరుసల రహదారి, కడప/నెల్లూరు సరిహద్దు నుంచి సీఎస్ పురం వరకు విస్తరణ, జాతీయ రహదారి–165పై గుడివాడ, నుజెల్లా రైల్వే స్టేషన్ల మధ్య నాలుగు వరుసల రైల్ ఓవర్ బ్రిడ్జి, జాతీయ రహదారి –716 పై పాపాగ్ని నదిపై ప్రధాన వంతెన, జాతీయ రహదారి –565పై కనిగిరి బైపాస్, జాతీయ రహదారి –544డీడీలోని ఎన్. గుండ్లపల్లి పట్టణంలో బైపాస్ సెక్షన్ అభివృద్ధి ఇందులో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌లో భద్రతను మెరుగుపరుస్తాయి, ప్రయాణ సమయాన్ని తగ్గిస్తాయి, ప్రాంతీయ అనుసంధానాన్ని బలోపేతం చేస్తాయి.

రూ. 1,200 కోట్లకు పైగా విలువైన పలు కీలక రైల్వే ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేసి, జాతికి అంకితం చేస్తారు. కొత్తవలస–విజయనగరం నాలుగో రైల్వే లైన్‌కు శంకుస్థాపన, పెందుర్తి – సింహాచలం ఉత్తర మధ్య రైల్ ఫ్లైఓవర్, కొత్తవలస–బొడ్డవర సెక్షన్ డబ్లింగును జాతికి అంకితం, షిమిలిగుడ–గోరాపూర్ సెక్షన్ ఇందులో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు రద్దీని తగ్గించడంతోపాటు వేగవంతమైన – సురక్షితమైన ప్రయాణాలను అందిస్తాయి. ప్రయాణికులు, సరుకు రవాణా సజావుగా సాగడానికి వీలు కల్పిస్తాయి. ఈ ప్రాంతంలో పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక వృద్ధిని ప్రోత్సహిస్తాయి. అదే సమయంలో స్థానికులకు ఉపాధి అవకాశాలు అందిస్తాయి.

ఇంధన రంగానికి సంబంధించి.. గెయిల్ ఇండియా లిమిటెడ్ చేపట్టిన శ్రీకాకుళం–అంగుల్ సహజ వాయు పైప్‌లైన్‌ను ప్రధానమంత్రి జాతికి అంకితం చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో 124 కి.మీ, ఒడిశాలో 298 కి.మీల విస్తీర్ణంలో మొత్తం రూ. 1,730 కోట్లతో దీనిని నిర్మించారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరులో ఇండియన్ ఆయిల్‌కు చెందిన 60 వేల మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యం కలిగిన ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంటును కూడా ఆయన ప్రారంభిస్తారు. దాదాపు రూ. 200 కోట్ల పెట్టుబడితో దీనిని నెలకొల్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు జిల్లాలు, తమిళనాడులోని రెండు జిల్లాలు, కర్ణాటకలోని ఒక జిల్లాలో 80 మంది డిస్ట్రిబ్యూటర్ల ద్వారా 7.2 లక్షలకు పైగా వినియోగదారులకు ఈ ప్లాంటు సేవలందించనుంది. ఈ ప్రాంతంలోని గృహ, వాణిజ్య సంస్థలకు నమ్మకమైన ఎల్పీజీ సరఫరాను అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

రక్షణ తయారీని బలోపేతం చేసే దిశగా.. కృష్ణా జిల్లా నిమ్మలూరులో అధునాతన నైట్ విజన్ ఉత్పత్తుల ఫ్యాక్టరీని ప్రధానమంత్రి జాతికి అంకితం చేస్తారు. దాదాపు రూ. 360 కోట్ల పెట్టుబడితో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ దీనిని నెలకొల్పింది. భారత రక్షణ దళాల కోసం అధునాతన ఎలక్ట్రో–ఆప్టికల్ వ్యవస్థలను ఈ కేంద్రం తయారు చేస్తుంది. రక్షణ ఉత్పత్తిలో స్వావలంబనను బలోపేతం చేయడంతోపాటు ఈ ప్రాంతంలో నైపుణ్యం కలిగిన ఉపాధిని ప్రోత్సహించాలన్న లక్ష్యాన్ని పునరుద్ఘాటిస్తుంది.

# భారత వృద్ధి అంచనాను ఐఎమ్ఎఫ్ పెంచడం దేశ ఆర్థిక సామర్థ్యం, బలమైన మూలాలకు నిదర్శనం: శ్రీ గోయల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:భారత వృద్ధి అంచనాను ఐఎమ్ఎఫ్ పెంచడం దేశ ఆర్థిక సామర్థ్యం, బలమైన మూలాలకు నిదర్శనం: శ్రీ గోయల్‌కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేయడం.. ఆర్థిక వ్యవస్థకు, పరిశ్రమలకు అత్యాధునిక పరిష్కారాలను అందించడం ద్వారా దేశాన్ని అగ్రగామిగా మార్చడంలో రసాయనాలు, పెట్రోకెమికల్ పరిశ్రమ ముందంజలో ఉందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ వ్యాఖ్యానించారు. ఈ రోజు సీఐఐ నిర్వహించిన 7వ భారతీయ రసాయనాలు, పెట్రోకెమికల్స్ సమావేశంలో ఆయన కీలకోపన్యాసం చేశారు.

సమాజంలోని అన్ని వర్గాలకు ప్రయోజనాన్ని చేకూర్చే సమతుల్య వృద్ధిని నిర్ధారించడం, దేశీయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రపంచ వేదికపై దేశాన్ని అగ్రస్థానంలో నిలపడం ప్రభుత్వ విధానాల లక్ష్యమని శ్రీ గోయల్ పేర్కొన్నారు. ఇటీవల అంతర్జాతీయ ద్రవ్య నిధి 2025లో భారత వృద్ధి అంచనాను 6.6 శాతానికి సవరించిందని, ఇది దాని మునుపటి అంచనా 6.4 శాతం కంటే మరింత పెరుగుదలను సూచిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇది దేశ ఆర్థిక సామర్థ్యానికీ, బలమైన ఆర్థిక మూలాలకు నిదర్శనమన్నారు.

సంపన్న, అభివృద్ధి చెందిన దేశాలు సాంకేతికత, ఆవిష్కరణలపై దృష్టి సారించడం ద్వారానే ఈ హోదాను సాధించాయని, భారత్ తన అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి ఈ మార్గాన్ని అనుసరించాలని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

చమురు నిల్వలు అధికంగా ఉన్న దేశాలు కూడా విలువ ఆధారిత ఉత్పత్తులు, పరిశుద్ధ ఇంధనం, పునరుత్పాదక ఇంధనం, వాతావరణ మార్పులకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాల్లో పెట్టుబడులు పెడుతున్నాయని శ్రీ గోయల్ స్పష్టం చేశారు. ఇది ఆవిష్కరణ ఆధారిత వృద్ధి దిశగా ప్రపంచ మార్పును ప్రదర్శిస్తుందన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ హెచ్చుతగ్గులను ఎదుర్కొంటోందనీ.. అయితే వాతావరణ మార్పులను పరిష్కరించడంతో పాటు సాంకేతికంగా పురోగతి సాధించాల్సిన అవసరం ఎంతో ఉందని ఆయన వ్యాఖ్యానించారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి, వికసిత్ భారత్ దార్శనికతను సాధించడానికి సైన్స్, పరిశోధనాభివృద్ధి, ఆవిష్కరణలు ఎంతో కీలకమని శ్రీ గోయల్ తెలిపారు.

దేశం మొత్తం అభివృద్ధిలో రసాయనాలు, పెట్రోకెమికల్ పరిశ్రమ గణనీయమైన సామర్థ్యాన్ని, దాని వ్యూహాత్మక పాత్రను కేంద్ర మంత్రి ప్రస్తావించారు. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలు, నిర్మాణం, ఇంధనం, రవాణా వంటి బహుళ రంగాల్లో ఈ పరిశ్రమ విస్తృత అనువర్తనాలు, ప్రభావాన్నీ కలిగి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిశ్రమ ఉత్పత్తులు, సేవలు విస్తరించాయనీ.. తయారీ, వినియోగ వ్యవస్థలో దాదాపు ప్రతి అంశాన్నీ ఇవి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితం చేస్తాయని ఆయన తెలిపారు. పరిశ్రమ నాయకులు తమ బలాలను జాగ్రత్తగా అంచనా వేస్తూ, ప్రపంచస్థాయిలో భారత్ సమర్థమైన ప్రయోజనాలను పొందగల ప్రాంతాలను గుర్తించాలని శ్రీ గోయల్ కోరారు. ప్రపంచ ఎగుమతుల్లో భారత్ వాటాను పెంచడం ద్వారా, ప్రస్తుత నామమాత్రపు సహకారాలను మించి అంతర్జాతీయ వాణిజ్య నాయకత్వం లక్ష్యంగా పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. సమర్థమైన సరుకు రవాణాతో పాటు, అనేక దేశాలకు సరుకులు రవాణా చేయడం కీలకమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ఒకే సరఫరాదారు లేదా పరిమిత సంఖ్యలో దేశాలపై ఆధారపడటం వల్ల వెనకబడిపోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. కొన్ని ఉత్పత్తుల్లో స్వయం–సమృద్ధినీ, సురక్షితమైన సరుకు రవాణాను నిర్ధారించడానికి దేశీయ భద్రత అవసరం అయినప్పటికీ.. సామర్థ్యం, పోటీతత్వం, సుస్థిరమైన వృద్ధిని సాధించడానికి ఈ రంగం ప్రపంచ మార్కెట్లతో ఏకీకృతం కావాలని శ్రీ గోయల్ స్పష్టం చేశారు.

దేశీయ పరిశ్రమలు పోటీతత్వాన్ని కొనసాగిస్తూనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానం కావడానికి భారత్ అనుసరిస్తున్న వ్యూహాత్మక విధానాన్ని శ్రీ గోయల్ ప్రముఖంగా ప్రస్తావించారు. భారత్ అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారాలంటే.. అంతర్జాతీయ మార్కెట్లతో క్రియాశీల భాగస్వామ్యం, వాణిజ్యానికి అవకాశాలను అన్వేషించడం, పెట్టుబడులను ఆకర్షించడం, అదే సమయంలో ప్రపంచ సమగ్రత –దేశీయ పరిశ్రమల రక్షణ మధ్య సమతుల్యతను కొనసాగించడం చాలా అవసరమని ఆయన స్పష్టం చేశారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై చర్చించడం.. ప్రపంచస్థాయి వాణిజ్య కార్యకలాపాలను విస్తరించడంపై తమ ప్రభుత్వం నిరంతరం దృష్టి సారిస్తోందని కేంద్ర మంత్రి వివరించారు.

మారిషస్, యూఏఈ, ఆస్ట్రేలియా, లీక్టెన్‌స్టెయిన్, నార్వే, ఐస్‌ల్యాండ్, స్విట్జర్లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్ సహా అనేక దేశాలు, ప్రాంతాలతో కుదుర్చుకున్న ఒప్పందాలను ఆయన ప్రస్తావించారు. భారతీయ ఉత్పత్తుల కోసం అనేక మార్కెట్లు అందుబాటులో ఉండేలా చేయడం.. సాంకేతికతనూ, పెట్టుబడులను ఆకర్షించడం.. ఆవిష్కరణ ఆధారిత రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడం లక్ష్యంగా ఈ వాణిజ్య భాగస్వామ్యాలను రూపొందించామని కేంద్ర మంత్రి తెలిపారు. దేశీయ పరిశ్రమలు అనవసరమైన ముప్పునకు గురికాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందనీ శ్రీ గోయల్ పేర్కొన్నారు.

భారతీయ వ్యాపారాలు అంతర్జాతీయంగా పోటీ పడేందుకు వీలు కల్పించడం, ఎగుమతులను ప్రోత్సహించడం, దేశీయ ఉత్పత్తిని రక్షిస్తూనే 140 కోట్ల మంది వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటం ద్వారా సున్నితమైన సమతుల్యతను సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# కొండవీడులో పల్నాడు కలెక్టర్ తన్మయం



అమరావతి, అక్టోబర్ 16: పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు కోట ప్రాంతాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ఈ రోజు సందర్శించారు. ఫూట్ రోడ్డుతో పాటు కొండపై ఉన్న చెరువులను పరిశీలించారు. విధుల చెరువులో బోటింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కొండవీడు కోటను సందర్శించిన జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణ ప్రియ మొక్కలు అందించి స్వాగతం పలికారు. కలెక్టర్ పర్యాటక అభివృద్ధి గురించి కొన్ని సూచనలు చేసారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. కొండవీడు ప్రాంతం ఎంతో చారిత్రకమైనదని దానిని పర్యాటకంగా ఎలా అభివృద్ధి చేయాలో ఒక ఆలోచన వచ్చేందుకు తాను వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించినట్లు వెల్లడించారు.

# ప్రపంచ శాంతిని పరిరక్షించడానికి మెరుగైన సంప్రదింపులు, సహకారం, సమన్వయం, సామర్థ్య నిర్మాణమే కీలకం: యూఎన్ దళాలకు సహకారమందిస్తున్న దేశాల ప్రధాన సైనికాధికారులతో రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:కొత్తగా పుట్టుకొస్తున్న సవాళ్లను ఎదుర్కోవడానికి, ప్రపంచ శాంతిని పరిరక్షించేందుకు ఐక్యరాజ్య సమితి చేస్తున్న శాంతి ప్రయత్నాలకు తోడ్పడుతున్న దేశాలకు మార్గనిర్దేశక సూత్రంగా మెరుగైన సంప్రదింపులు, సహకారం, సమన్వయం, సామర్థ్య నిర్మాణం అనే – 4సీ సూత్రాన్ని రక్షణ మంత్రి శ్రీ రాజనాథ్ సింగ్ సూచించారు. భారత్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న చీఫ్స్ కాంక్లేవ్ ప్రారంభ కార్యక్రమంలో యునైటెడ్ నేషన్స్ ట్రూప్ కంట్రిబ్యూజ0జాజదటింగ్ కంట్రీస్ (యూఎన్‌టీసీసీ)కు చెందిన ఉన్నత స్థాయి సైనికాధికారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమం న్యూఢిల్లీలోని మానెక్‌షా సెంటర్లో 2025 అక్టోబర్ 14 నుంచి 16 వరకు జరుగుతుంది.

యుద్ధం, ఉగ్రవాదం, సున్నితమైన రాజకీయ పరిస్థితులు నెలకొన్న అస్థిర వాతావరణంలో మోహరింపుల దగ్గర నుంచి.. మానవతా సంక్షోభాలు, మహమ్మారులు, ప్రకృతి వైపరీత్యాలు, అసత్య ప్రచారాలను ఎదుర్కోవడం వరకు శాంతి రక్షక బలగాలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లలో పెరుగుతున్న సంక్లిష్టతను రక్షణ మంత్రి వివరించారు. బలగాలు, పోలీసులు, రవాణా సదుపాయాలు, సాంకేతికత, ప్రత్యేక సామర్థ్యాల ద్వారా శాంతి పరిరక్షణ కార్యకలాపాలను కొనసాగించేందుకు సహకారాన్ని మరింత విస్తరించాలని సభ్యదేశాలకు.. ముఖ్యంగా సాంకేతికంగా ముందంజలో ఉన్న, ఆర్థిక సామర్థ్యాలున్న వాటిని కోరారు. భద్రమైన సమాచార ప్రసార, పర్యవేక్షణ వ్యవస్థలు, మానవ రహిత వాహనాలు వంటి ఆవిష్కరణలను.. శాంతి కార్యకలాపాలను మరింత సురక్షితంగా, ప్రభావవంతంగా చేపట్టేందుకు దోహదపడతాయని స్పష్టం చేశారు.

"కొత్తగా ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోడానికి భాగస్వామ్య దేశాల బలగాల్లో ధైర్యం, అనుసరణ, ఆవిష్కరణల కంటే, యుద్ధ వాతావరణాన్ని ప్రభావితం చేయడానికి సంబంధిత రాజకీయ నాయకులు, ఆర్థిక భాగస్వామ్యం అందించే దేశాలు, ఇతర కీలక వ్యక్తులను భాగం చేసే మిషన్ స్థాయిలో సమగ్ర విధానం అవసరం. మోహరింపులో ఆలస్యం, వనరుల కొరత, యుద్ధాలకు మూల కారణాలను పరిష్కరించేందుకు తగిన ఆదేశాలు లేకపోవడం వల్ల ఈ కార్యకలాపాలు ప్రభావాన్ని చూపడంలో తరచూ వెనకబడి పోతున్నాయి. కాలం చెల్లిన బహుపాక్షిక సంస్థలతో ఆధునిక సమస్యలను పరిష్కరించలేం. సమగ్ర సంస్కరణలు లేకపోతే.. ఐక్యరాజ్య సమితిపై విశ్వాసం లోపిస్తుంది. ప్రస్తుతం ఉన్న పరస్పరం అనుసంధానమైన ప్రపంచంలో సంస్కరించిన బహుపాక్షిక విధానం అవసరం. ఇది వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా, సభ్య దేశాలన్నింటికీ మాట్లాడే అవకాశాన్నిచ్చేలా, సమకాలీన సమస్యలను పరిష్కరించేలా, మానవ సంక్షేమంపై దృష్టి సారించేలా ఉండాలి" అని రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ శాంతి భద్రతలను కాపాడేందుకు ఐక్యరాజ్య సమితి చేపట్టే కార్యక్రమాలకు భారత్ ఎల్లప్పుడూ అండగా నిలిచిందని, ఈ నిబద్ధత పట్ల దృఢంగా వ్యవహరిస్తోందని రక్షణ మంత్రి తెలియజేశారు. "గడచిన దశాబ్దాల్లో 2,90,000 మంది భారతీయ సిబ్బంది 50కి పైగా యూఎన్ శాంతి పరిరక్షక కార్యకలాపాల్లో సేవలందించారు. వారి వృత్తి నిబద్ధత, ధైర్యం, కరుణ అంతర్జాతీయ గుర్తింపు పొందాయి. కాంగో, కొరియా నుంచి దక్షిణ సూడాన్, లెబనాన్ వరకు దుర్బల పరిస్థితుల్లో ఉన్నవారిని రక్షించడానికి, ఆయా ప్రాంతాలను పునర్నిర్మించడానికి మా సైనికులు, పోలీసులు, వైద్య నిపుణులు అంతర్జాతీయ సమాజంతో కలసి పనిచేశారు. శాంతి పరిరక్షణను మరింత ప్రభావవంతంగా, జవాబుదారీతనంగా మార్చేందుకు బలగాలను అందించడానికి, నైపుణ్యాలను పంచుకోవడానికి, సంస్కరణలకు మద్దతు ఇవ్వడానికి మేం సిద్ధంగా ఉన్నాం. సహకారం, సాంకేతికతను పంచుకోవడం ద్వారా మెరుగుపరిచిన సన్నద్ధత, మరింత అనుసరణీయత కలిగిన, మరింత మానవత్వం నిండిన మిషన్లను మనం ఏర్పాటు చేయగలం" అని ఆయన తెలిపారు.

శాంతి పరిరక్షణ విజయం అంకెల్లో కాదని, సన్నద్ధతలోనే ఉంటుందన్న శ్రీ రాజనాథ్ సింగ్, న్యూఢిల్లీలో ఉన్న యునైటెడ్ నేషన్స్ పీస్ కీపింగ్ సెంటర్ ద్వారా 90 దేశాలకు చెందినవారికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. మిషన్ విజయానికి అవసరమైన పరస్పర అవగాహనను పెంపొందించడానికి.. మిత్ర దేశాలకు చెందిన శాంతి పరిరక్షకులకు శిక్షణ ఇవ్వడానికి, వారి మధ్య సమన్వయ కార్యాచరణను అభివృద్ధి చేయడానికి అవసరమైన సామర్థ్యాలు భారత్ వద్ద ఉన్నాయని తెలియజేశారు.

ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం ద్వారా తక్కువ ఖర్చులోనే దేశీయ సాంకేతికతలను భారత్ అభివృద్ధి చేసిందని రక్షణ మంత్రి అన్నారు. ఇవి వాహనాలు, భద్రమైన సమాచార ప్రసార, పర్యవేక్షణ వ్యవస్థలు, మానవ రహిత వైమానిక వాహనాలు, వైద్య సహాయ పరిష్కారాల ద్వారా శాంతి పరిరక్షక కార్యకలాపాలను బలోపేతం చేస్తాయని వివరించారు.

శాంతి పరిరక్షక దళాల్లో పెరుగుతున్న మహిళల భాగస్వామ్యాన్ని స్ఫూర్తిదాయకమైన పరివర్తనల్లో ఒకటిగా శ్రీ రాజనాథ్ సింగ్ వర్ణించారు. వారి భాగస్వామ్యం మిషన్ ప్రభావాన్ని మరింత పెంచుతుందని, స్థానిక ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడానికి, కార్యకలాపాల్లో సహానుభూతిని పెంచడానికి తోడ్పడుతుందన్నారు. "ఈ విషయంలో భారత్ మార్గదర్శిగా ఉంది. 2007లో లైబీరియాలో మోహరించిన పూర్తిగా మహిళలతో కూడిన పోలీస్ యూనిట్ సాధికారతకు అంతర్జాతీయ చిహ్నంగా మారింది. వృత్తి పట్ల వారి నిబద్ధత, కరుణ జాతీయ పోలీస్ విభాగంలో చేరేలా ఒక తరానికి చెందిన లైబీరియన్ మహిళలకు స్ఫూర్తినిచ్చింది. ప్రస్తుతం దక్షిణ సూడాన్, గోలన్ హైట్స్, లెబనాన్లో చేపడుతున్న కార్యకలాపాల్లో భారతీయ మహిళా అధికారులు సేవలందిస్తున్నారు. వారు గస్తీ నిర్వహణలో, సమాజంతో మమేకమవ్వడంలో, స్థానిక మహిళలు, యువతకు మార్గనిర్దేశం చేయడంలో గణనీయమైన కృషి చేస్తున్నారు. సమ్మిళితత్వం, గౌరవం, నమ్మకం ద్వారా ఆధునిక శాంతి పరిరక్షణ కార్యకలాపాల్లో ఏం సాధించవచ్చో వారు చేసి చూపిస్తున్నారు. డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో చేపట్టిన యూఎన్ శాంతి పరిరక్షణ కార్యకలాపాల్లో అత్యుత్తమ సేవలందించిన భారతీయ సైనిక దళానికి చెందిన శాంతి పరిరక్షకురాలికి 2024లో యునైటెడ్ నేషన్స్ మిలటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం లభించింది" అని మంత్రి తెలిపారు.

వైద్య శాంతి పరిరక్షకుల భాగస్వామ్యం గురించి రక్షణ మంత్రి మాట్లాడుతూ.. ఆఫ్రికా వ్యాప్తంగా ఉన్న యూఎన్ ఫీల్డ్ ఆసుపత్రుల్లో వేలాది మంది ప్రజలకు, శాంతి పరిరక్షకులకు భారతీయ వైద్య బృందం చికిత్స అందించిందని వెల్లడించారు. "తరచూ ప్రతికూలతలు ఎదురయ్యే పరిస్థితుల మధ్య వారు అందించే సేవలో.. భారతీయ శాంతి పరిరక్షకుల ఉత్తమ సంప్రదాయాలు, మానవత్వ స్ఫూర్తి నిండిన యూఎన్ విధానం నిండి ఉన్నాయి" అని వివరించారు.

విశ్వగురువుగా ఎదగాలన్న భారత దేశ ఆకాంక్ష.. ఆధిపత్యాన్ని ప్రకటించడం కోసం కాదని సహకారాత్మక, సమ్మిళిత అభివృద్ధికి ఇస్తున్న పిలుపు అని శ్రీ రాజనాథ్ సింగ్ స్పష్టం చేశారు. అహింస, అంతర్గత శాంతి అనే వారసత్వ విలువలను పంచుకోవడం ద్వారా ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షణ, శాంతి నిర్మాణ కార్యకలాపాలను బలోపేతం చేయవచ్చని, సామరస్యంతో నిండిన ప్రపంచ శాంతిని ప్రోత్సహించవచ్చనే భారత నమ్మకాన్ని ఆయన తెలియజేశారు.

"ఇటీవలి కాలంలో అంతర్జాతీయ చట్టాలను కొన్ని దేశాలు బహిరంగంగా ఉల్లంఘిస్తున్నాయి. ఆ చట్టాలను అణచివేసేందుకు మరికొన్ని ప్రయత్నిస్తున్నాయి. ఇంకొన్ని దేశాలు సొంత నియమాలు రూపొందించుకొని రాబోయే శతాబ్దంలో ఆధిపత్యం చెలాయించాలని ప్రయత్నిస్తున్నాయి. వీటన్నింటి మధ్య.. కాలం చెల్లిన అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలను కోరుతూనే.. నియమ ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థను సమర్థించాలని భారత్ బలంగా వాదిస్తోంది. మహాత్మా గాంధీ పుట్టిన భూమి భారత్. అహింస, శాంతి మూలాలు మా విధానంలో బలంగా పాతుకుపోయాయి. మహాత్మాగాంధీ దృష్టిలో శాంతి అంటే యుద్ధం జరగకపోవడం కాదు.. న్యాయం, సామరస్యం, నైతిక బలాల సానుకూల స్థితి" అని రక్షణమంత్రి అన్నారు.

చీఫ్ ఆఫ్ ది ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ప్రారంభోపన్యాసం చేస్తూ.. ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షణలో దీర్ఘకాలంగా భారత్ అందిస్తున్న సహకారాన్ని తెలియజేశారు. న్యూఢిల్లీలో ఉన్న యూఎన్ శాంతి పరిరక్షణ కేంద్రం లాంటి సంస్థల ద్వారా కార్యాచరణ నైపుణ్యం, సాంకేతిక ఆవిష్కరణలు, సామర్థ్య నిర్మాణం అందించేందుకు భారత సైన్యం సంకల్పాన్ని ఆయన పునరుద్ఘాటించారు. శాంతి పరిరక్షణలో ఆవిష్కరణలు, సమ్మిళితత్వం, కార్యకలాపాల్లో సమన్వయం అవసరాన్ని చీఫ్ ఆఫ్ ది ఆర్మీ స్టాఫ్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ భాగస్వాములకు రక్షణ రంగంలో సమర్థవంతమైన పరిష్కారాలను భారత్ అనుసరిస్తున్న ఆత్మనిర్భర భారత్ ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రపంచ శాతి కార్యకలాపాల భవిష్యత్తును సమష్టిగా రూపొందించడానికి చేపట్టిన ఈ కార్యక్రమంలో త్రివిధ దళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్, వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్, శాంతి కార్యకలాపాల అండర్ –సెక్రటరీ–జనరల్ జీన్ పియర్ లక్రోయిక్స్, ఐక్యరాజ్య సమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్, ఇతర సైనిక ఉన్నతాధికారులు, ప్రభుత్వాధికారులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

# అండమాన్‌ను అంతర్జాతీయ ఇంటర్నెట్ డేటా బదిలీకి తదుపరి ప్రధాన కేంద్రంగా మార్చేందుకు భారత ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు: శ్రీ అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న గూగుల్ ఏఐ హబ్ భారతదేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ అన్నారు. త్వరలో జరిగే ఇండియా ఏఐ శిఖరాగ్ర సదస్సుకు ముందస్తుగా గూగుల్ విశాఖపట్నంలో నిర్వహించిన 'భారత్ ఏఐ శక్తి' కార్యక్రమంలో శ్రీ అశ్వినీ వైష్ణవ్ ప్రసంగించారు. "గూగుల్ ఏఐ హబ్ భారతదేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో కొత్త శకానికి నాంది పలుకుతుంది. ఈ మౌలిక సదుపాయాలు ఏఐ ఫస్ట్ డేటా సెంటర్ ఆర్కిటెక్చర్ రంగంలో కొత్త దారులను తెరుస్తాయి. ఇవి కొత్త సబ్‌సీ కేబుల్ నెట్‌వర్క్‌లలో పెట్టుబడులు, స్వచ్ఛమైన ఇంధనంతో ఆధారితమై ఉంటాయి. ఇది ఏఐ ఆధారిత సేవలకు కొత్త శకాన్ని అందించడమే కాకుండా, దేశవ్యాప్తంగా ఉన్నత విలువ గల ఉద్యోగాలు, ఆర్థిక అవకాశాలను కూడా సృష్టిస్తుంది. ఈ భాగస్వామ్యం ద్వారా ప్రపంచ స్థాయి సాంకేతికత భారతదేశానికి రావడం చూసి మేము గర్విస్తున్నాం'' అని పేర్కొంటూ, ఇండియా ఏఐ మిషన్ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో ఈ హబ్ పాత్రను కేంద్ర మంత్రి ప్రముఖంగా వివరించారు. "ఈ డిజిటల్ మౌలిక సదుపాయాలు మన ఇండియా ఏఐ మిషన్ లక్ష్యాలను చేరుకోవడంలో చాలా వరకు ఉపయోగపడతాయి'' అని అన్నారు.

ఏఐ సేవలను భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఒక ముఖ్యమైన అభివృద్ధి చెందుతున్న రంగంగా శ్రీ అశ్విని వైష్ణవ్ అభివర్ణించారు. ప్రతిభను, ఉద్యోగాల కల్పనను పెంచడానికి ఈ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని ఆయన గూగుల్‌ను కోరారు. ఇండియా ఏఐ మిషన్ కింద సాధారణ కంప్యూట్ మౌలిక సదుపాయాలలో భాగంగా ఎన్వీఐడిఐఏ గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ (జీపీయూ) లతో పోటీ పడటానికి గూగుల్ టెన్సర్ ప్రాసెసింగ్ యూనిట్ (టీపీయూ) రాకను ఆయన స్వాగతించారు. ఏఐ హబ్ భారత ఏఐ మిషన్ లక్ష్యాలను గణనీయంగా ముందుకు నడిపిస్తుందని అన్నారు. వేగవంతమైన ఏఐ ఆధారిత మార్పుల మధ్య ఐటీ నిపుణులకు పెద్ద ఎత్తున నైపుణ్యాలను తిరిగి నేర్పడం, నైపుణ్యాలను మెరుగుపరచాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు. ఈ కృషిలో పరిశ్రమకు మద్దతు ఇవ్వాలని ఆయన గూగుల్‌ను కోరారు.

సముద్ర తీరంలో సబ్‌సీ కేబుల్ కనెక్టివిటీ ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, "అండమాన్, నికోబార్ దీవులు వ్యూహాత్మకంగా ఉన్నాయి. సింగపూర్ పై ఇప్పటికే భారం ఎక్కువగా ఉంది. గ్లోబల్ ఇంటర్నెట్ డేటా బదిలీ కోసం అండమాన్ ను తదుపరి ప్రధాన కేంద్రంగా ఎందుకు మార్చలేం? భారత ప్రభుత్వం నుంచి ఈ ప్రయత్నానికి పూర్తి మద్దతు అందిస్తాం. ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియా మొదలైన కొత్త డేటా సామర్థ్యాన్ని అన్వేషిస్తున్న ఇతర ప్రాంతాలకు కనెక్ట్ అయ్యేందుకు అండమాన్ దీవులు గూగుల్, ఇతర ఇంటర్నెట్ ఆధారిత సంస్థలకు సహాయం చేయగలవు'' అని వివరించారు.

ఈశాన్య రాష్ట్రాలలో డిజిటల్ కనెక్టివిటీని బలోపేతం చేయడానికి వైజాగ్ - సిట్వే (మయన్మార్) లింకును ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి ప్రతిపాదించారు. ఇప్పటికే ఉన్న రైల్‌టెల్ నెట్‌వర్క్‌ను మెరుగుపరచవలసిన ఆవశ్యకతను ఆయన ఈ సందర్భంగా వివరించారు. సైరాంగ్ వరకు రైల్వే లైన్ ఇప్పటికే పూర్తి అయినందున, ప్రధానమంత్రి ఆదేశాల మేరకు దానిని మయన్మార్ సరిహద్దు వరకు పొడిగించే పని జరుగుతున్నందున మయన్మార్ మీదుగా మిజోరాం వరకు కేబుల్‌ను విస్తరించడం ఒక ముఖ్యమైన ముందడుగు అవుతుందని ఆయన పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్‌లో ఈ ముఖ్యమైన పెట్టుబడి భారత డిజిటల్ మార్పు ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయాన్ని లిఖిస్తుంది'' అని అన్నారు. భారతదేశంలో మొట్టమొదటి అసలైన గిగావాట్ - స్కేల్ డేటా సెంటర్, గూగుల్ మొదటి ఏఐ హబ్‌కు ఆతిథ్యం ఇవ్వడం తమకు గర్వకారణమని, రాష్ట్రంలోని వ్యాపారాలు, స్టార్టప్‌లకు ఆవిష్కరణలు, ఏఐ స్వీకరణ, దీర్ఘకాలిక మద్దతు పట్ల తమకు గల భాగస్వామ్య నిబద్ధతకు ఇది ఒక నిదర్శనమని ఆయన అన్నారు.

గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ మాట్లాడుతూ,"విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్ భారతదేశ డిజిటల్ భవిష్యత్తులో ఒక కీలక పెట్టుబడిగా నిలుస్తుంది. పరిశ్రమలోని ప్రధాన ఏఐ మౌలిక సదుపాయాలను పెద్ద ఎత్తున అందించడం ద్వారా వ్యాపారాలను వేగంగా ఆవిష్కరించడానికి మేం సహాయపడుతున్నాం. సమ్మిళిత వృద్ధికి అర్థవంతమైన అవకాశాలను సృష్టిస్తున్నాం. ఈ భాగస్వామ్యం భారత్, అమెరికా ప్రభుత్వాలతో ఏఐను బాధ్యతతో ఉపయోగించాలనే, సమాజానికి మార్పు చూపే ప్రభావాన్ని తీసుకురావాలనే మా సార్వత్రిక కట్టుబాటును ప్రతిబింబిస్తుంది'' అని పేర్కొన్నారు.

భారత్ అంతటా ఏఐ ఆధారిత మార్పును వేగవంతం చేసే లక్ష్యంతో, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు గూగుల్ ప్రకటించింది. ఈ హబ్ ద్వారా కంపెనీ తన పూర్తి ఏఐ పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తుంది. ఈ కొత్త ఏఐ హబ్ అధునాతన ఏఐ మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్ సామర్థ్యం, పెద్ద ఎత్తున పునరుత్పాదక ఇంధన వనరులు, విస్తరించిన ఫైబర్-ఆప్టిక్ నెట్‌వర్క్‌లన్నింటిని ఒకేచోటకు తీసుకువస్తుంది.

దీనిపై రాబోయే ఐదేళ్లలో (2026?2030) సుమారు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడతారు. ఇది ఇప్పటివరకు భారతదేశంలో గూగుల్ పెడుతున్న అతిపెద్ద పెట్టుబడి. ఏఐ ఆధారిత సేవలను వేగవంతం చేయాలనే లక్ష్యం కలిగివున్న భారత ప్రభుత్వ వికసిత భారత్ దార్శనికతతో ఇది ముడిపడింది.

విశాఖపట్నంలోని గూగుల్ ఏఐ హబ్ ప్రత్యేకంగా నిర్మించే డేటా సెంటర్ క్యాంపస్‌ను కలిగి ఉంటుంది. ఇది భారత్ అంతటా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిజిటల్ సేవల డిమాండ్‌ను తీర్చడంలో సహాయపడటానికి గిగావాట్ స్థాయి కంప్యూటింగ్ సామర్థ్యాన్ని జోడిస్తుంది. అదానీ కోనెక్స్, ఎయిర్‌టెల్ వంటి భాగస్వాములతో కలసి దీనిని అభివృద్ధి చేస్తున్నారు. గూగుల్ సర్చ్, వర్క్‌స్పేస్, యూట్యూబ్ వంటి గూగుల్ ఉత్పత్తులకు శక్తినిచ్చే అత్యాధునిక మౌలిక సదుపాయాలతో దీనిని నిర్మిస్తారు.

వ్యాపారాలు, సంస్థలు తమ సొంత ఏఐ ఆధారిత పరిష్కారాలను రూపొందించడానికి, వాటిని విస్తరించడానికి అవసరమైన అధిక పనితీరు, ఆలస్యం లేని సేవలను కూడా ఈ ఏఐ హబ్‌అందిస్తుంది. ఇది పరిశోధన, అభివృద్ధిని వేగవంతం చేస్తుంది. అంతిమంగా ఏఐ ఆధారిత భవిష్యత్తులో భారత్ ప్రపంచ నాయకత్వ స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి సహాయపడుతుంది. ఇది మేక్ మై ట్రిప్, మీషో, టీసీఎస్ వంటి పెద్ద సంస్థలతో పాటు, కొరోవర్, గ్లాన్స్, ఇన్వీడియో ఏఐ, సర్వం వంటి సంస్థలకే కాకుండా, ఇతర భారతీయ ఏఐ స్టార్టప్‌లకు కూడా ప్రయోజనం చేకూరుస్తుంది.

కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత ఈ కొత్త డేటా సెంటర్ క్యాంపస్ ఇప్పటికే 12 దేశాలలో విస్తరించి ఉన్న గూగుల్ ఏఐ డేటా సెంటర్ల నెట్‌వర్క్‌లో చేరుతుంది. బెంగళూరు, హైదరాబాద్, పుణెలలోని గూగుల్ ఆర్ అండ్ డీ కేంద్రాలు అభివృద్ధి చేసిన సాంకేతికతతో, కీలకమైన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ ఆవిష్కరణల రూపకల్పన, అభివృద్ధి సహా అనేక ప్రయోజనాలను పొందుతుంది.

గూగుల్ ఏఐ హబ్ పెట్టుబడిలో భాగంగా, భారత తూర్పు తీరంలోని విశాఖపట్నంలో ల్యాండ్ అయ్యేలా బహుళ అంతర్జాతీయ సముద్ర గర్భ కేబుల్స్‌తో కూడిన ఒక కొత్త అంతర్జాతీయ సబ్‌సీ గేట్‌వే నిర్మాణం కూడా ఉంది. ఇది గూగుల్ కు ఇప్పటికే ఉన్న రెండు మిలియన్ మైళ్ళకు పైగా భూగర్భ, సముద్రం అడుగున ఉన్న కేబుల్స్‌కు అనుసంధానమౌతుంది. ఇది విశాఖపట్నాన్ని భారతదేశానికి మాత్రమే కాకుండా, ప్రపంచం మొత్తానికి సేవలు అందించే ఏఐ, కనెక్టివిటీ హబ్‌గా ఉంచుతుంది.

ఈ గేట్‌వే దేశంలో పెరుగుతున్న డిజిటల్ డిమాండ్‌ను తీర్చడానికి, ఇప్పటికే ముంబై, చెన్నై ప్రాంతాలలో ఉన్న సబ్‌సీ కేబుల్ ల్యాండింగ్‌లకు అదనంగా రూట్ వైవిధ్యాన్ని అందించడానికి సహాయపడుతుంది. అధిక-సామర్థ్యం, తక్కువ ఆలస్యం గల ఈ కొత్త మార్గాలు గూగుల్ వినియోగదారులకు వేగవంతమైన అనుభవాలను అందిస్తాయి. ఇది భారతదేశ డిజిటల్ పునాదుల స్థిరత్వాన్ని, సామర్థ్యాన్ని పెంచుతుంది. అలాగే, దేశవ్యాప్తంగా డిజిటల్ సమ్మిళితం, మార్పుకు దోహదం చేస్తూ, ఏఐ లాభాలను మరింతమంది ప్రజలకు, వ్యాపారాలకు అందిస్తుంది.

గూగుల్ అత్యంత శక్తి సామర్థ్యాలు కలిగిన డేటా సెంటర్లను నిర్వహిస్తోంది. తన మౌలిక సదుపాయాలను బాధ్యతాయుతంగా పెంచడానికి కట్టుబడి ఉంది. భారతదేశంలో ఇప్పటికే ఉన్న గూగుల్ స్వచ్ఛమైన ఇంధన కార్యక్రమాలకు కొనసాగింపుగా, ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు, స్వచ్ఛమైన ఇంధన శక్తి ఉత్పత్తి, ఇంధన నిల్వ వ్యవస్థలను అందించడానికి కంపెనీ స్థానిక భాగస్వాములతో కలిసి పనిచేస్తోంది. ఈ చర్య భారత విద్యుత్ గ్రిడ్‌కు దోహదపడే స్వచ్ఛమైన ఇంధన సాంకేతికతల విభిన్న పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తుంది.

# ప్యారిస్ ఒప్పందం, వాతావరణ లక్ష్యాలను విస్తరించడానికి చర్చలతో కూడిన విధానంపై విశ్వసనీయతను వ్యక్తం చేసిన భారత్

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:బ్రెజిల్ యాలో జరిగిన కాప్30 సన్నాహక సమావేశాల్లో భాగంగా అక్టోబర్ 13న జరిగిన గ్లోబల్ స్టాక్ టేక్ (జీఎస్టీ) బ్రేకవుట్ సెషన్లో కేంద్ర పర్యావరణ అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ ప్రసంగించారు. మొదటి జీఎస్టీ విజయవంతంగా పూర్తయిందని చెబుతూ... ఇది పారిస్ ఒప్పందం చురుగ్గా అమలవుతోందని ధ్రువీకరిస్తుందన్నారు.

పారిస్ ఒప్పందం లక్ష్యాల దిశగా ప్రపంచం సాధిస్తున్న సమష్టి ప్రగతిని అంచనా వేసే ఐదేళ్ల ప్రక్రియ జీఎస్టీ. సమష్టి పురోగతిని అంచనా వేయడం, ఇతర అంతరాలను గుర్తించడం, దేశీయంగా, అంతర్జాతీయంగా మెరుగైన చర్యలను కొనసాగించడం అనే మూడు ప్రధాన పాత్రలను పోషించడం ద్వారా లక్ష్యాన్ని బలోపేతం చేసేందుకు జీఎస్టీ రూపుదిద్దుకుందని శ్రీ యాదవ్ తెలియజేశారు.

ఈ నేపథ్యంలో.. ఒప్పందాన్ని నడిపించే, రాజకీయ వేగాన్ని ప్రోత్సహించే, ఉన్నత ఆశయాల దిశగా ప్రయత్నాలను కొనసాగించే శక్తిగా జీఎస్టీ పనిచేస్తుందని మంత్రి అన్నారు. చర్చల్లో ఈ అంశాలపై దృష్టి సారించడం ద్వారా సాధించే జీఎస్టీ ఫలితాలు.. అంతర్జాతీయ సహకారానికి, దేశీయంగా వాతావరణ చర్యలను ప్రోత్సహించడానికి దోహదపడతాయి.

భవిష్యత్తు జీఎస్టీల విషయంలో.. శాస్త్రీయ అంచనా విధానాలు అందించే అంతర్జాతీయ ప్రయోజనాలపై సరైన చర్చ లేకుండా వాటిని అమలు చేయడానికి తొందరపడొద్దని మంత్రి ప్రతిపాదించారు. సైన్స్ ఎల్లప్పుడూ నిర్దుష్టంగా, కచ్చితంగా, స్పష్టంగా ఉండాలని... సంబంధిత వనరులన్నింటికీ పరిగణనలోకి తీసుకోవాలని ఆయన అన్నారు.

"వాతావరణ చర్యల లక్ష్యాలను అమలు చేయడంపై మనం దృష్టి సారించాలి. అన్నింటికీ మించి, అభివృద్ధి చెందుతున్న దేశాలకు అవసరమైన వనరులు అందుబాటులో లేకపోవడం అనే అతి పెద్ద సవాలును పరిష్కరించేందుకు ప్రయత్నించాలి" అని మంత్రి అన్నారు. ఎలాంటి చర్యలు చేపట్టకుండా నిరంతర సమీక్షలు అసంబద్ధమైనవన్నారు. "చర్చలు ముఖ్యమే.. కానీ చర్యలు చేపట్టడం అనివార్యం'' అని అభిప్రాయపడ్డారు.

# పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారు : ఐసీడీసీ సూపర్‌వైజర్ సంతోషిమాత



మెదక్, అక్టోబర్ 16: ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని మండల ఐసీడీసీ సూపర్‌వైజర్ సంతోషిమాత తెలిపారు. గురువారం చిలిపిచెడ్ మండల కేంద్రమైన హైస్కూల్‌లో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థినీవిద్యార్థులకు, సమతుల ఆహారం గురించి, ఎనీమియా చాలెంజ్ గురించి ఆమె తెలియజేశారు. స్థానికంగా దొరికే 37 రకాల ఆకుకూరల గురించి వివరించడం జరిగింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను తయారు చేసి స్టాల్ ఏర్పాటు చేయడం జరిగింది.విద్యార్థినీ విద్యార్థులకు, పోషకాహారంపై వ్యాసరచన పోటీ, డ్రాయింగ్ పోటీ నిర్వహించడం జరిగింది. అందులో గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. చివరగా అందరితో పోషణ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓ విట్టల్, చందూరు కాంప్లెక్స్, హెచ్ఎం రమేష్ చిలిపి చెడ్ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ధనమూర్తి, ఆర్ఐలు సునీల్ చౌహాన్, వెంకటేశం, ప్రతిమ, అన్ని గ్రామాల అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

# గురుగ్రామ్‌లోని మానేసర్‌లో జరిగిన ఎన్ఎస్‌జీ 41వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ప్రసంగించిన కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:గురుగ్రామ్‌లోని మానేసర్‌లో జరిగిన నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ) 41వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్ఎస్‌జీ క్యాంపస్‌లో స్పెషల్ ఆపరేషన్స్ ట్రైనింగ్ సెంటర్ (ఎస్.ఓ.టీ.సీ.) నిర్మాణానికి కేంద్ర హోంమంత్రి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, ఎన్ఎస్‌జీ డైరెక్టర్ జనరల్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా మాట్లాడుతూ సర్వత్ర, సర్వోత్తమ, సురక్ష అనే మూడు సూత్రాలతో పాటు సమర్పణ, సాహసం, దేశభక్తి అనే సద్గుణాలతో ఎన్ఎస్‌జీ నాలుగు దశాబ్దాలుగా దేశంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా గణనీయ పోరాటం చేసిందన్నారు. మన భద్రత, ఉగ్రవాదంపై పోరాటం చాలా సురక్షితమైన చేతుల్లో ఉందని దేశంలోని ప్రతి పౌరుడు విశ్వసిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్ఎస్‌జీ సిబ్బంది దృఢ నిశ్చయం, ధైర్యం, వ్యూహాత్మక విధానంతో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడి మంచి ఫలితాలను అందించిన తీరు భారత భద్రతా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖితమైందని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు.

స్పెషల్ ఆపరేషన్స్ ట్రైనింగ్ సెంటర్ (ఎస్.ఓ.టీ.సీ.) ఏర్పాటుకు ఈరోజు శంకుస్థాపన జరిగిందని కేంద్ర హోంమంత్రి తెలిపారు. రూ. 141 కోట్ల వ్యయంతో 8 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్న ఈ కేంద్రం.. ఉగ్రవాదంపై పోరాడుతున్న ప్రత్యేక కమాండోలకు అత్యాధునిక శిక్షణను అందిస్తుందన్నారు. ఎన్ఎస్‌జీ సిబ్బందికి మాత్రమే కాకుండా దేశవ్యాప్త పోలీసు దళాల్లో ఏర్పాటు చేసిన యాంటీ-టెర్రర్ యూనిట్లకూ ఉగ్రవాదంపై పోరాటం కోసం వారిని సిద్ధం చేసేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణను ఎస్.ఓ.టీ.సీ.లు అందిస్తాయని శ్రీ అమిత్ షా తెలిపారు. భారత్ వంటి విశాలమైన దేశంలో కేవలం కేంద్ర ప్రభుత్వం మాత్రమే ఉగ్రవాదాన్ని ఎదుర్కోలేదనీ... అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు, పోలీసు దళాల ప్రత్యేక విభాగాలు, ఎన్ఎస్‌జీలతో పాటు కేంద్ర సాయుధ పోలీసు దళాలన్నీ (సీఏపీఎఫ్‌లు) దేశ భద్రత కోసం కలిసి పనిచేయాలని శ్రీ అమిత్ షా ఉద్ఘాటించారు. ఈ ఎస్.ఓ.టీ.సీ. రాబోయే రోజుల్లో ఉగ్రవాదంపై పోరాటాన్ని మరింత శక్తిమంతం చేస్తూ.. మన దళాలను ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంచుతుందని ఆయన అన్నారు.

1984 నుంచి ఎన్ఎస్‌జీ సర్వత్ర, సర్వోత్తమ, సురక్ష అనే మూడు సూత్రాలను అమలు చేస్తూ... ఆపరేషన్ అశ్వమేధ, ఆపరేషన్ వజ్ర శక్తి, ఆపరేషన్ ధంగు వంటి ఆపరేషన్స్ ద్వారా.. అలాగే అక్షరధామ్ దాడి, ముంబయి ఉగ్ర దాడుల సమయంలోనూ ధైర్యం, అసమాన సామర్థ్యంతో దేశాన్ని కాపాడిందని శ్రీ అమిత్ షా కొనియాడారు. ఎన్ఎస్‌జీ ధైర్యం, అంకితభావాలను చూసి యావత్ దేశం గర్విస్తుందని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎన్ఎస్‌జీ కార్యకలాపాల్లో గణనీయమైన మార్పులను తీసుకువస్తుందని శ్రీ అమిత్ షా ప్రకటించారు. ముంబయి, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్, అహ్మదాబాద్, జమ్మూలలో ఇప్పటికే ఆరు ఎన్ఎస్‌జీ హబ్‌లు ఏర్పాటయ్యాయనీ.. ఇక్కడ ఎన్ఎస్‌జీ కమాండోలు సంవత్సరంలోని 365 రోజులూ 24 గంటలూ విధుల్లో ఉంటారని ఆయన తెలిపారు. అయోధ్యలో ఇప్పుడు కొత్త ఎన్ఎస్‌జీ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు హోంమంత్రి ప్రకటించారు. ఈ హబ్‌లోని కమాండోలు తమ జోన్ పరిధిలో ఏదైనా ఆకస్మిక ఉగ్రదాడి జరిగితే బలమైన ప్రతిస్పందనను అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా, అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్ర పోలీసు దళాలకు, ఉగ్రవాద నిరోధక విభాగాలకు శిక్షణనివ్వడం, అత్యుత్తమ పద్ధతులను పంచుకోవడం, దళాల ఫిట్‌నెస్‌ను నిర్ధారించడంపై ఎన్ఎస్‌జీ ప్రధాన కార్యాలయం నిరంతరం దృష్టి సారిస్తోందని శ్రీ అమిత్ షా ఉద్ఘాటించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించని దృఢమైన విధానాన్ని అవలంబిస్తోందని కేంద్ర హోంమంత్రి తెలిపారు. 2019 నుంచి ఉగ్రవాద ముప్పుల నుంచి దేశాన్ని రక్షించడానికి తమ ప్రభుత్వం గణనీయమైన చర్యలు తీసుకుంటోందని ఆయన అన్నారు. శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ).. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చట్టాన్ని సవరించడంతో పాటు, ఉగ్రవాద గ్రూపులకు నిధులను అరికట్టడానికి మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎమ్ఎల్ఏ).. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) లను క్రియాశీలం చేసిందనీ.. ఉగ్రవాద నిధులపై శాస్త్రీయ దర్యాప్తు కోసం ఒక వ్యవస్థనూ ఏర్పాటు చేసిందని ఆయన వివరించారు. ప్రభుత్వం పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)ని నిషేధించడంతో పాటు మల్టీ ఏజెన్సీ సెంటర్ (ఎమ్ఏసీ)ని బలోపేతం చేసిందన్నారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్-సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్), నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్ (ఎన్ఏటగ్రిడ్) ద్వారా దేశవ్యాప్తంగా దర్యాప్తు సంస్థలతో డేటా షేరింగ్‌ను ప్రారంభించిందని కేంద్ర హోంమంత్రి తెలిపారు. ఉగ్రవాదులు లొసుగులను సాకుగా చూపి కోర్టుల నుంచి తప్పించుకునే సమస్యను పరిష్కరించడానికి మూడు కొత్త క్రిమినల్ చట్టాల్లో మొదటిసారిగా ఉగ్రవాదానికి సమగ్ర నిర్వచనం ఇచ్చిందన్నారు.

57 మందికి పైగా వ్యక్తులు, సంస్థలను ఉగ్రవాదులుగా, ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించామనీ, వారి కార్యకలాపాలనూ విజయవంతంగా నిరోధించామని శ్రీ అమిత్ షా తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు, సర్జికల్ స్ట్రైక్స్, వైమానిక దాడులు, ఆపరేషన్ సిందూర్ వంటి చర్యల ద్వారా మోదీ ప్రభుత్వం ఉగ్రవాద నెట్‌వర్క్‌ల మూలాలపై బలంగా దెబ్బకొట్టిందన్నారు. తీవ్రవాదులు ఏ మూలలో దాగున్నా మన భద్రతా సంస్థలు గుర్తించి.. శిక్షిస్తాయని నిరూపితమైందని కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఉగ్రవాదులు ప్రపంచంలో ఎక్కడా దాక్కోలేరు. భారత్‌లో దాడులకు ప్రణాళిక చేస్తున్న పాకిస్తాన్ ఉగ్రవాద గ్రూపుల ప్రధాన కార్యాలయాన్నీ, వారి శిక్షణా శిబిరాలనూ, లాంచ్ ప్యాడ్‌లను ఆపరేషన్ సిందూర్ నాశనం చేసిందని కేంద్ర హోంమంత్రి తెలిపారు. పహల్గామ్ ఉగ్రవాద దాడికి పాల్పడిన వారిని ఆపరేషన్ మహాదేవ్ అంతం చేసిందనీ, తద్వారా మన భద్రతా దళాలపై దేశానికి మరింత నమ్మకం పెరిగిందని ఆయన అన్నారు.

గత నాలుగు దశాబ్దాలుగా ఎన్ఎస్‌జీ సిబ్బంది దేశవ్యాప్తంగా 770కి పైగా కీలక ప్రదేశాల్లో నిఘా నిర్వహించారనీ.. సంభావ్య ఉగ్రవాద దాడులను ఎదుర్కోవడానికి వ్యూహాత్మక ప్రణాళికలతో కూడిన డేటా బ్యాంక్‌ను రూపొందించారని కేంద్ర హోంమంత్రి తెలిపారు. ఆసుపత్రులు, మతపరమైన ప్రదేశాలు, ఇతర ముఖ్యమైన సంస్థలు, జలమార్గాలు, భారత పార్లమెంటు భద్రత కోసం ఎన్ఎస్‌జీ చాలా జాగ్రత్తగా చక్కని ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. మహాకుంభ్ అయినా.. పూరీ రథయాత్ర అయినా.. ఏదైనా మతపరమైన కార్యక్రమం అయినా.. ఎన్ఎస్‌జీ ధైర్యం, అంకితభావం, భద్రతకు చిహ్నంగా మారిందని శ్రీ అమిత్ షా ప్రధానంగా ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎన్ఎస్‌జీని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సన్నద్ధం చేయడమే కాకుండా దాని కార్యకలాపాల్లోనూ గణనీయమైన మార్పులను తీసుకువస్తుందని ఆయన తెలిపారు. రాబోయే అనేక సంవత్సరాలు ఎన్ఎస్‌జీ తన నాలుగు దశాబ్దాల ఘనమైన వారసత్వాన్ని నిలబెట్టుకుంటుందని శ్రీ అమిత్ షా విశ్వాసం వ్యక్తం చేశారు.

2019 నుంచి కేంద్ర సాయుధ పోలీసు దళాల (సీఏపీఎఫ్‌ల) సిబ్బంది చెట్ల పెంపకం ప్రచారంలో భాగంగా 6.5 కోట్లకు పైగా మొక్కలను నాటారనీ, దేశ పచ్చదనాన్ని కాపాడటానికి గణనీయ తోడ్పాటునందించారని శ్రీ అమిత్ షా తెలిపారు. సీఏపీఎఫ్ సిబ్బంది ఈ మొక్కలను తమ సొంత పిల్లల్లాగే పెంచి, పర్యావరణాన్ని పరిరక్షించడంలోనూ ప్రధాన పాత్ర పోషిస్తున్నారని కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యానించారు.

# రైతులు ధాన్యాన్ని శుభ్రం చేసి తీసుకురావాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్గొండ, అక్టోబర్ 16: రైతులు తాము పండించిన ధాన్యాన్ని ఆరుబయట ఆరబోసుకుని తాలు, గడ్డి లేకుండా శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం శాలిగౌరారం మండలంలోని అడ్లూరు, తుడిమిడి గ్రామాల్లో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నిర్వాహకులు సైతం సమన్వయం పాటించాలని, రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. అనంతరం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, కేజీబీవీ పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట పీడీ శేఖర్ రెడ్డి, ఆర్డీఓ అశోక్ రెడ్డి, తాసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, పీఏసీఎస్ సీఈఓ నిమ్మల ఆంజనేయులు, ఏపీఎం శంకరయ్య పాల్గొన్నారు.

# మూఢనమ్మకాలు నమ్మవద్దు.. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సీఐ లతీఫ్

మెదక్, అక్టోబర్ 16: సిద్దిపేట జిల్లా రాయపోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంసాగర్ గ్రామంలో బుధవారం రాత్రి కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొగుట సిఐ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ మానస మాట్లాడుతూ.. ఆశ, భయం, మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. బ్యాంకు అధికారులు అని ఫోన్ చేస్తే నమ్మవద్దు, అకౌంట్ డీటెయిల్స్ పర్సనల్ డీటెయిల్స్ గుర్తుతెలియని వ్యక్తులకు షేర్ చేయవద్దు, ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.

## పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు గమనిస్తుండాలి..

గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. పిల్లలు ఏం చేస్తున్నారో కూడా తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని ఎక్కడికి వెళుతున్నారు.. ఎవరెవరితో తిరుగుతున్నారు..

ఒక కన్నేసి ఉంచాలని తెలిపారు. ఎవరైనా గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలు అయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని.. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న డీ అడిక్షన్ సెంటర్‌లో చికిత్స, కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఇప్పుడే వస్తాము తక్కువ దూరం కదా అని హెల్మెట్ పెట్టుకోకుండా అశ్రద్ధ చేయవద్దు. రోడ్డు ప్రమాదం ఎవరికి ఎప్పుడు ఎలా జరుగుతుందో ఎవ్వరూ ఊహించలేరు, ఎంత పెద్ద రోడ్డు ప్రమాదమైనా తలకు దెబ్బతగలకుండా ఉంటే బతికే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడు రోడ్డు విశాలంగా అయినందున రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి, మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి.

# పౌష్టికాహారంతోనే మహిళలకు సంపూర్ణ ఆరోగ్యం : నరసింహారావు



నల్గొండ, అక్టోబర్ 16: పౌష్టికాహారంతోనే మహిళలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సూర్యాపేట జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు అన్నారు. గురువారం తుంగతుర్తి మండల పరిధిలోని కొత్తగూడెం రైతు వేదికలో సీడీపీఓ శ్రీజ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీల ద్వారా అందించే పదార్థాల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయన్నారు. చిరుధాన్యాలు, ఆకుకూరలతో తయారు చేసిన పోషకాహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. పోషక విలువలతో కూడిన ఆహారంపై విద్యార్థులకు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీజ మాట్లాడుతూ.. ప్రతి గర్భిణీ రక్తహీనతతో ఉండకుండా ఐరన్ ప్రొటీన్‌తో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ దయానందం, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, సూపర్‌వైజర్ అనురాధ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# ఇంటి పైనుంచి పడి వ్యక్తి మృతి

నల్గొండ, అక్టోబర్ 16: నూతనంగా నిర్మిస్తున్న ఇంటి స్లాబ్‌కు వాటర్ పెడుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి భవనం నుంచి కింద పడటంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన భూదాన్ పోచంపల్లి మండలం పెద్దగూడెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది.

పెద్దగూడెం గ్రామానికి చెందిన పారిపల్లి కృష్ణారెడ్డి (53) సొంతింటి నిర్మాణం చేపట్టాడు. ఫస్ట్ ఫ్లోర్లో (ఇంటి స్లాబ్ ) క్యూరింగ్ కు వాటర్ పెడుతున్నాడు.

ప్రమాదవశాత్తు కాలుజారి భవనం పైనుండి కింద ( సీసీ రోడ్ మీద) పడడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. ఇరుగుపొరుగు గమనించి చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో కన్నుమూశాడు. కృష్ణారెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# ప్రతిపక్ష కూటమి సీట్ల షేరింగ్‌లో ప్రతిష్ఠంభన.. లాలూయాదవ్‌కు రాహుల్‌గాంధీ ఫోన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 16: బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్‌ల పర్వం జోరుగా సాగుతోంది. ఎన్డీయే కూటమి అభ్యర్థులు మాత్రమే నామినేషన్‌లు దాఖలు చేస్తున్నారు. ఎందుకంటే ప్రతిపక్ష మహాఘట్బంధన్ లో ఇంకా సీట్ల పంపకాల పంచాయతీ తెగలేదు. ఈ క్రమంలో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తో.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే , ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్‌లో సంప్రదింపులు జరుపుతూ సీట్ల సర్దుబాటుపై చర్చిస్తున్నట్లు తెలిసింది.

సీట్ల పంపకాల్లో ముందున్న ఎన్డీయే కూటమి పార్టీలు ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటిస్తున్నాయి. అయినప్పటికీ విపక్ష ఇండియా కూటమిలో పార్టీలు మాత్రం సీట్ల పంపకాలపై ఏకాభిప్రాయానికి రావడం లేదు. కాంగ్రెస్‌కు దాదాపు 50 సీట్లు ఇచ్చేందుకు ఆర్జేడీ సిద్ధంగా ఉండగా.. కాంగ్రెస్ మాత్రం కనీసం 60 స్థానాలు కేటాయించాలని పట్టుపడుతున్నట్లు తెలిసింది. కానీ తమ పార్టీకి పట్టున్న స్థానాలను వదులుకునేందుకు ఆర్జేడీ సిద్ధంగా లేదు. దాంతో సీట్ల షేరింగ్ కొలిక్కి రావడం లేదని తెలుస్తోంది.

రాష్ట్రస్థాయిలో రెండు పార్టీల నేతలు పలు దఫాలుగా చర్చలు జరిపినా ఈ అంశం తేలలేదు. దాంతో కాంగ్రెస్ హైకమాండ్ నేరుగా రంగంలోకి దిగింది. ఖర్గే, రాహుల్ ఇద్దరూ లాలూతో చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. చర్చలు కొలిక్కి వస్తేనే ప్రతిపక్ష కూటమి అభ్యర్థుల నామినేషన్‌ల దాఖలుకు లైన్ క్లియర్ కానుంది.

